నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

1

శనివారం | 25 మే 2024 | www.navatelangana.com

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ

నవతెలంగాణ - మెదక్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సర తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. మొదటి సంవత్సర పరీక్షలలో జనరల్ విభాగంలో 959 గాను 914 విద్యార్థులు హాజరైనారు. ఒకేషనల్ విభాగంలో 29 గాను 28 విద్యార్థులు పరీక్షకు హాజరైనారు. జిల్లాలో మొదటి రోజు హాజరు శాతం 95 శాతంగా నమోదైంది. రెండవ సంవత్సర తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. రెండవ సంవత్సర పరీక్షలలో జనరల్ విభాగంలో 339 గాను 318 విద్యార్థులు హాజరైనారు. ఒకేషనల్ విభాగంలో 43 గాను 43 విద్యార్థులు పరీక్షకు హాజరైనారు. జిల్లాలో మొదటి రోజు హాజరు శాతం 95 శాతంగా నమోదైంది. జిల్లాలో ఉన్న బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల మెదక్, టియస్ యస్ డబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాల మెదక్ పరీక్షల కేంద్రాలను ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ, పరీక్ష కేంద్రాలను జిల్లాలో నర్సాపూర్, కౌల్చారం, కౌడిపల్లి కమిటీ సభ్యులు శశిధర్, అశోక్, జిల్లాలో ఉన్న పాపన్నపేట, టేక్మాల్, అల్లాదుర్గ్, పెద్దశంకరంపేట పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బందం పర్యవేక్షించారు.

గుర్తుతెలియని కారు ఢీకొని మహిళ మృతి

నవతెలంగాణ - హవేలీ ఘనపూర్

మెదక్ రామాయంపేట ప్రధాన రహదారి తీన్ నెంబర్ గేట్ వద్ద గుర్తు తెలియని కారు డీకొట్టడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. హవేలీ ఘనపూర్ ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం హవేలీ ఘనపూర్ గ్రామానికి చెందిన బత్తుల వెంకట్ ఆయన భార్య రేణుక ఇద్దరు కలిసి హవేలీ ఘనపూర్ మండలంలోని బ్యాతోల్ గ్రామం నుంచి హవేలీ ఘనపూర్‌కు తిరిగి వస్తుండగా తీన్ నెంబర్ వద్ద గుర్తుతెలియని కారు వెనక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర బత్తుల రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన రేణుకకు మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యలోమృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు.

ఈతకు వెళ్లి వ్యక్తి మృతి పెండ్లింట విషాదం

నవతెలంగాణ-పాపన్నపేట



నాలుగు రోజులుగా పెళ్లి ఇంట సరదాగా గడుపుతున్న తరుణంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామ శివారులో ఉన్న మంజీరాలో సరదాగా ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు రామతీరం తెలిపిన వివరాల ప్రకారం రామతీర్థం గ్రామానికి చెందిన నల్లోల్ల గంగయ్య, నిర్మలమ్మ కుమారుడైన మోష వివాహం గత బుధవారం జరిగింది. ఈ వివాహానికి దగ్గరి బంధువైన జయపురం గ్రామానికి చెందిన బజారు కృష్ణ(34) అలియాస్ కిష్టయ్య కుటుంబ సభ్యులతో కలిసి వివాహానికి నాలుగు రోజులముందు చేరుకున్నాడు. మూడు రోజులపాటు వివాహ తంతులో సరదాగా గడిపారు. శుక్రవారం ఉదయం సమయంలో బంధువులతో కలిసి గ్రామ శివారులో ఉన్న మంజీరాలో ఈతకు వెళ్లారు. సరదాగా అందరూ కలిసి ఈత కొడుతున్న సమయంలో బజారు కృష్ణ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఈ విషయాన్ని పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మమత, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కృష్ణ హైదరాబాద్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

పుట్టగొడుగుల్ల పుట్టుకొస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు

- అక్రమాలను అరికట్టాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లాలో పుట్టగొడుగుల్లా అక్రమంగా పుట్టుకొస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అధికారులను డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్పొరేట్ విద్యాసంస్థలు పెరుగుతున్నాయని, వాటిని పట్టించుకునే నాధుడు లేకుండా పోతున్నారన్నారు. అక్షరాలకు లక్షల ఫీజులతో విద్య పేరు మీద వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. మాడ్యులాస్, శ్రీ చైతన్య బ్రాంచ్‌లు, ఒకులే, గల్లీకో బేబీ కేర్‌లు వెలుస్తున్నాయన్నారు. ప్రతి సంవత్సరానికి ఒక బ్రాంచ్ లెక్క పెరుగుతున్నా విద్యాశాఖ అధికారులు కళ్ళు మూసుకొని, కాసులకు కక్కుర్తి పడి పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అనుమతి ఇచ్చిన పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా ఎలాంటి సదుపాయలు లేవని, విద్యా శాఖ అధికారులు పట్టించుకోకుండా వసతులు లేని పాఠశాలలకు పర్మిషన్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. అనుమతులు లేని, అనుమతులు ఉండి సౌకర్యాలు కల్పించని పాఠశాలలపైన జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రవేట్ విద్యాసంస్థలు ఇచ్చే డబ్బులకు లొంగకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని, అధికారులు చర్యలు తీసుకోకుంటే విద్యార్థుల జీవితాలు నాశనమవుతాయని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించే ముందు వాటికి అనుమతులు ఉన్నాయా, సదుపాయాలు ఉన్నాయా లేవా అని చూసి చేర్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు తాడూరి భరత్ కుమార్ పాల్గొన్నారు.

భూగర్బ జలాల పెంపు చర్యలు భేష్



నవతెలంగాణ-మర్కుక్

అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని కేంద్ర బందం సభ్యులు అన్నారు. 2023 సంవత్సరానికి 5వ రాష్ట్రం నుంచి సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం అంగడి కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఎంపికైన విషయం తెలిసిందే. శుక్రవారం పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ , పంచాయత్ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీదేవిలు సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల యాజమాన్యం తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలకు అనుసరిస్తున్న విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడి సతీష్ కుమార్,పంచాయితీ కార్యదర్శి నీలిమా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ రాధాకష్ణ, ఉపాధ్యాయులు రామకష్ణారెడ్డి,చిన్నికష్ణ, నవీన, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కేసు దర్యాప్తులో అవకతవకలు, ఎస్ఐ సస్పెండ్

నవ తెలంగాణ-మిరుదొడ్డి



సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని భూంపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వి.రవికాంత్ పై సస్పెన్షన్ వేటు వేస్తూ.. మల్టీ జోన్ 1 ఐజిపి ఎ.వి రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఓ కేసులో అవకతవకలకు పాల్పడిన కారణంగా ఎస్ఐ వి. రవికాంత్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సస్పెండ్ అయిన ఎస్.ఐ రవికాంత్ గతంలో మెదక్ జిల్లా శివంపేట్ ఎస్ఐగా విధులు నిర్వహించే సమయంలో మామిడి తోటలో యాభై టన్నులకు పైగా మామిడి పండ్లు చోరికి గురైనట్లుగా సంబంధిత మామిడి తోట యజమానురాలు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ తక్షణమే కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేలింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసిన కొద్ది రోజులకే... కేసు సివిల్ పరిధిలోకి వస్తుందని పోలీసు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి చోరీ కేసును సివిల్ వివాదం కేసుగా ముగించేందుకు ఎస్ఐ రవికాంత్ అవకతవకలకు పాల్పడ్డాడు. దాంతో పాటు భూతగాదా కేసుల్లో బాధితులకు కాకుండా వారి ప్రత్యర్థులకు సహకారం అందిస్తు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా ఆరోపణలు రావడంతో మెదక్ ఎస్పీ సమర్పించిన విచారణ నివేదికలో ఎస్ఐ రవికాంత్ పై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో వి.రవికాంత్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వుల జారీ చేశారు.

మెదక్‌పై మూడు పార్టీల్లో ఆశలు



- మెదక్‌పై బీఆర్ఎస్ గంపెడాశలు
- పార్టీ ఓట్లు క్రాస్ అయ్యాయనే చర్చ
- కాంగ్రెస్ గెలిస్తే చరిత్రను తిరగరాసినట్టే
- ప్రభుత్వ అనుకూల ఓటుపై నమ్మకం
- గులాబీ ఓటు క్రాస్..బీజేపీకా కాంగ్రెస్‌కా..?
- గ్రామాల్లోనూ అంక్షింతల ప్రభావం
- జూన్ 4 న తేలనున్న ఫలితాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అంతు చిక్కని ఓటరు నాడితో నరాలు తెగే ఉత్కంఠ కొనసాగుతోంది. ఓటరు తీర్పు ఓటు వైపు మొగ్గు చూపిందనే విషయాలపై అనేక చర్చలు నడుస్తున్నాయి. గులాబీ పార్టీ ఓట్లు క్రాస్ అయ్యాయని కొందరంటున్నారు. లేదు బీఆర్ఎస్ పోల్ మేనేజ్‌మెంట్ బాగా చేసిందంటున్నారు. కాంగ్రెస్‌కు ప్రభుత్వ పట్ల ఉన్న సానుకూలత కలిసొస్తుందనే చర్చ ఉంది. బీజేపీకి బీఆర్ఎస్ ఓటు క్రాస్ అవ్వడమే కాకుండా పల్లెల్లోనూ అక్షింతల ప్రభావం కనిపించిందనే వాదన లేకపోలేదు. ఎవరి ధీమా వారికున్నా ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరు నాడిపై ఇప్పటికే ఏ పార్టీ మేం గెలుస్తున్నామని బల్లగుద్ది చెప్పే పరిస్థితి లేదు. మే 13న జరిగిన పోలింగ్ సరళిపై పూర్తి పోస్టుమార్టం చేశాక మాత్రం ఏఏ అంశాలు అనునూలత చూపాయి..? ఏఏ అంశాలు ప్రతికూలంగా మారాయనే విషయాల్లో మాత్రం ప్రధాన పార్టీలు ఓ స్పష్టతకు వచ్చాయి. ఎన్ని కోణాల్లో విశ్లేషణలు చేసినా ఎన్ని నివేదికలు వచ్చినా జూన్ 4న ఫలితాలు తేలేదాక ఇదే ఉత్కంఠ తప్పదు.

అనేక విశ్లేషణలు...వాదనలు

ఏ నలుగురు గుమి కూడినా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపైనే చర్చ మొదలవుతుంది. ఏ సోషల్ మీడియాను గమనించినా మెదక్‌లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఏ పత్రికలు, టీవీలు చూసినా ఇదే చర్చ. మెదక్ బీఆర్ఎస్ కంచుకోటలు కావడం, మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు సొంత ఇలాక కావడంతో అందరి దృష్టి అక్కడే ఉంది. మెదక్‌లో బీఆర్ఎస్‌కు పాతికేళ్ల రికార్డుంది. ఐదు సార్లు గెలుస్తూ వచ్చింది. ఈ సారీ గెలుపు కోసం కష్టపడింది. ఇక బీఆర్ఎస్ రికార్డును తిరగరాస్తున్నామంటూ కాంగ్రెస్ ధీమాగా ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండింటినీ ఓడించి మా పార్టీ గెలుస్తుందని పువ్వు గుర్తోళ్లు వాదిస్తున్నారు. మూడు పార్టీలకూ గెలిగే అవకాశాలున్నాయి. నువ్వా నేనా అన్నట్లు పోటీ సాగింది. ఓటర్లు కూడా వన్‌సైడ్ మొగ్గు చూపలేదు.

మూడు పార్టీల్లో ఆశావాదం

మూడు పార్టీల్లోనూ గెలుపు పట్ల ఆశాబావం వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ మెదక్ తమదే అంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు బలమైన ఓట్లు పడ్డాయని చెబుతున్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాతో పాటు సంగారెడ్డి, నర్సాపూర్‌లోనూ బీఆర్ఎస్ పోల్‌మేనేజ్ మెంట్ బాగా చేసింది ఓటుకు రూ.500 పంచిన పార్టీల్లో బీఆర్ఎస్ ఒక్కటే అని చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికల మాదిరే పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోల్ మేనేజ్‌మెంట్ ఫర్‌ఫెక్ట్‌గా బీఆర్ఎస్ చేసిందనే అభిప్రాయాన్ని ఎవ్వరూ కాదనలేరు. ముఖ్యంగా హరీశ్‌రావు రంగంలో దిగి పోలింగ్ బూత్ స్థాయిలో తన వ్యూహాల్ని అమలు చేశాడంటున్నారు. అదే వర్కవుట్ అయితే వెంకట్రాంరెడ్డి గెల్వడం ఖాయమనే విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నాలుగు నెలల పానలలో యాసంగి పంట కాలంలో ఏర్పడిన ఇబ్బందులతో రైతులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినట్లు చెబుతున్నారు. రుణమాఫీ, రైతు బంధు, కరెంట్ కోతలు, నీటి ఎద్దడి వంటి ఇబ్బందులు కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారితే రైతాంగం ఓట్లు బీఆర్ఎస్‌కే పడి ఉంటాయంటున్నారు. ఫించన్‌దారులు, నిరుద్యోగులు కూడా కారుకే వేశారంటున్నారు. ఇదంతా ఆ పార్టీకి సానుకూల అంశాలు కాగా బీఆర్ఎస్ ఓటర్లు కొంత మేరకు క్రాస్ ఓటింగ్ చేశారంటున్నారు. అయితే ఆ క్రాస్ ఓట్లు బీజేపీకి పడ్డాయా..? లేక ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై కాంగ్రెస్‌కు వేశారా అనేది స్పష్టత రావట్లేదు. ఇది బీఆర్ఎస్‌కు కాస్త ప్రతికూల అంశంగా చెప్పొచ్చు. పటాన్‌చెరు, మెదక్‌లోనూ బీఆర్ఎస్‌కు అనుకున్న స్థాయిలో ఓట్లు పడలేదు. ఇక కాంగ్రెస్ పార్టీ మెదక్ లోక్‌సభ స్థానం నుంచి గెవ్వక పాతికేళ్ల దాటింది. బాగారెడ్డి తర్వాత ఒక సారి బీజేపీ గెల్వగా వరుసగా ఐదు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తూ వస్తుంది. బీఆర్ఎస్ సుదీర్ఘ రికార్డును కాంగ్రెస్ తిరగరాయాలని చూసింది. సీఎం రేవంత్‌రెడ్డి మెదక్‌పై పోకస్ పెట్టి ఎన్నికల్లో ప్రచారం చేశారు. అయితే ఎంత వరకు వర్కవుట్ అయిందనే విషయంలో ఆనేక విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఆ పార్టీ అభ్యర్థి నీలం మధు ఏడు నియోజకవర్గాల్లో పరిచయాలు లేకపోవడం మైనస్‌గా మారిందంటున్నారు. ఆరు చోట్ల ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు పెద్దగా ప్రభావం చూపలేకపోయారనేది కాదనలేని సత్యంగా కనిపిస్తుంది. అయితే ఆరు గ్యారంటీల్లో కొన్ని పథకాల ప్రభావం ఉందని చెప్పాలి. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటివి సానుకూల ఓటింగ్‌ను పెంచాయి. బీసీ అభ్యర్థి కావడం వల్ల ఆ వర్గాలు కాంగ్రెస్‌కు ఓటు వేశారంటున్నారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, మెదక్, నర్సాపూర్‌లో బాగా ఓటింగ్ తెచ్చుకుంటే సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలో కాస్త వెనకబడినా కాంగ్రెస్‌కే విన్నింగ్ ఛాయిస్ ఉంటుందంటున్నారు. అయితే సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ వస్తే మాత్రం కాంగ్రెస్‌కు నష్టం తప్పదంటున్నారు. పైగా ఆ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కంటే బీజేపీకి ఎక్కువ లేదంటే సమాన ఓట్లు వచ్చినా కాంగ్రెస్ వెనకంజలోకి నెట్టబడి బీజేపీ ముందుకొస్తదనే అభిప్రాయమూ వ్యక్తమవుతుంది. మెదక్‌లో బీజేపీ గెల్వబోతుందనే వాదన కూడా బలంగా ఉంది. వివిద సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్‌లోనూ బీజేపీకే అవకాశముందంటున్నాయి. క్షేత్రస్థాయిలో చూస్తే ఆ పార్టీకి అంత సీన్ ఉందా అనే వాదన కూడా ఉంది. మధ్య తరగతి, పట్టణ ప్రజలు సాధారణంగా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ వైపు మొగ్గు చూపడం సహజం. కానీ..! ఈ సారి అక్షింత ప్రబావంతో పల్లెల్లోనూ కమలం పువ్వుకు ఓట్లు పడ్డాయని తేలింది. ఒక్క కార్యకర్తలేని మారుమూల గ్రామాల్లోనూ బీజేపీకి ఓట్లేశామని జనం చెప్పడం ఆ పార్టీలో ఆశలు రెకెత్తిస్తున్నాయి. సిద్దిపేట, గజ్వేల్, పటాన్‌చెరు, సంగారెడ్డి, మెదక్ నియోజకవర్గాల్లో బీజేపీకి బలమైన ఓటింగ్ పోలైందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అందుకే బీజేపీ గెల్వబోతుందనే ధీమా మాకుందని ఆ పార్టీ అభ్యర్థి రఘునందన్ పేర్కొంటున్నారు. ఎవరి అంచనాలు వారికున్నా ఎవరు ఏ విధమైన విశ్లేషణలు చేసినా ఓటరు ఇప్పటికే తీర్పు ఇచ్చారు. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరు నాడి తెల్వాలంటే జూన్ 4 వరకు ఆగాల్సిందే.

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసీ, అఖిలపక్ష పార్టీల తీర్మానం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని జేఏసీ,అఖిలపక్ష పార్టీలు తీర్మానించాయి. ఈ సందర్భంగా శుక్రవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఆల్ ఇండియా ఫార్వడ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరన్న అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్‌తో పాటు చేర్యాల నియోజకవర్గాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ డివిజన్ సాధన కోసం పోరాటం గత 7 సవత్సరాలుగా జరుగుతుందని, ఈ పోరాటంలో చేర్యాల, చేర్యాల రూరల్, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల లోని యాబై మూడు గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా అంచెలంచెలుగా పాల్గొంటున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అప్పుడు అధికారంలో ఉన్న కేసీఆర్, బీఆర్ఎస్ అభ్యర్థి ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వాగ్దానం చేసి మాట తప్పారని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ పార్టీ అభ్యర్థి ఓటమి చెందిన జనగామ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డిలు కూడా ఎన్నికల సందర్భంగా జరిగిన బహిరంగ సభలో తాము అధికారంలోకి వస్తే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని ప్రకటించారన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చి 6 నెలలు గడిచినా రెవెన్యూ డివిజన్ గూర్చి మాట్లాడకపోవడం సిగ్గు చేటన్నారు. మాట తప్పిన అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజలు అడుగడుగునా నిలదీయాలన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ప్రజల మద్దతుతో జేఏసీ, రాజకీయ పక్షాలు, అన్ని ప్రజా, కుల సంఘాలతో జూన్ 1న జరిగే సమావేశంలో అంచలంచెలు పోరాటా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశం లోపు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనియెడల గ్రామాలలో అధికార కాంగ్రెస్ పార్టి నాయకులను అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జేఏసీ నాయకులు తాడెం ప్రశాంత్, బిజ్జ రాము, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బురూగు సురేష్, జిల్లా కార్యదర్శితో కల ఉమారాణీ, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మిట్టపల్లి నారాయణ రెడ్డి, సీపీఎం చేర్యాల, మద్దూరు, దూలి మిట్ట మండలాల కొంగరి, వెంకట మావో, ఆలేటి యాదగిరి, చొప్పరి రవి కుమార్, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండకింది అరుణ్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి



సత్యనారాయణ, కుర్మ సంఘం నాయకులు కామళ్ల అనీల్, ఓరుగంటి శంకర్, బీజేపీ పార్టీ చేర్యాల పట్టణ అధ్యక్షులు మన్నె సత్యవర్ధన్, సీపీఎం నాయకులు బోయిని మల్లేశం, ఆముదాల నర్సిరెడ్డి, ఎర్రబోస్ అశోక్ ,ముస్త్యాల ప్రభాకర్, మంచాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమాన్ని విస్మరించిన పాలకులు

- హక్కుల సాధన కోసం వికలాంగులంతా ఉద్యమాలకు సిద్ధం కావాలి
- అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- జూలై 21,22 తేదీల్లో మెదక్ జిల్లా 7వ మహాసభలు
- ఎన్పిఆర్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య

నవతెలంగాణ-మెదక్

వికలాంగుల సంక్షేమాన్ని పాలకులు విస్మరించారని, హక్కుల సాధన కోసం వికలాంగులంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎన్పిఆర్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు కె. యశోద అధ్యక్షతన వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మెదక్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎన్పిఆర్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య మాట్లాడుతూ. దేశంలో తిండి లేక 10కోట్ల మంది అల్లాడుతుంటే కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని, నిత్యావసర సరకుల ధరలు 300 శాతం పెంచి పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. స్విస్ బ్యాంక్లో ఉన్న అవినీతి సొమ్ము తీసుకువచ్చి దేశంలో ఉన్న ప్రతి ఒక్కరి అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి, ఎందుకు వేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ తీసుకువచ్చి ప్రజలపై భారం వేసి సంపన్నులకు లక్షల కోట్ల రాయితీ ఇచ్చే హక్కు మోడీకి ఎక్కడిదని ప్రశ్నించారు. పేదరికం తగ్గిందని చెపుతున్న మోడీ 81 కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ ఎందుకు చేయాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు 2014 వరకు 55 లక్షల కోట్లు అప్పు చేస్తే, మోడీ పరిపాలించిన 10ఏండ్ల కాలంలో 113లక్షల కోట్ల అప్పు చేశారని, మోడీ పుణ్యాన దేశంలో ప్రతి ఒక్కరి తలపై రూ. 1,02,000 అప్పు పడిందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణ రాష్ట్రంలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. 10 లక్షల ప్రాథమిక ఉప వైద్య కేంద్రాలు ఉండాల్సిన చోట కేవలం లక్ష నలభై ఆరు కేంద్రాలతో అందరికి వైద్యం ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ 10 ఏండ్ల కాలంలో కేవలం 7వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చామని పార్లమెంట్లో ప్రకటించారని తెలిపారు. రైల్వేలో ఊడవడం, కడగడం లాంటి పనుల కోసం 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే 1.25కోట్ల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత వికలాంగులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దు చేయాలని కుట్రలు చేస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వికలాంగులపై దాడులు, మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2011 నుంచి వికలాంగులకు రూ.300లకు పెన్షన్ ఇస్తుందని, ధరల పెరుగుదలకు అనుగుణంగా వికలాంగుల పెన్షన్ 5000లకు పెంచడం లేదన్నారు. కరోనా సమయంలో రూ. 1000 ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పి కేవలం 10 లక్షల మందికే ఇచ్చి చేతులు దులుపుకుందని తెలిపారు. ఇప్పటి 2016 ఆర్పిడి చట్టానికి కమిషనర్ ను నియమించలేదని, నేషనల్ ట్రస్ట్‌కు చైర్మన్‌ను నియమించలేదని తెలిపారు. 9 నేషనల్ ఇన్స్టిట్యూట్ ను 4 సంస్థలుగా విలీనం చేయాలని నిర్ణయం చేసిందన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్స్‌లలో కొత్త నియమాలు చేయడం లేదని, 2016 ఆర్పీడబ్లుడి చట్టంలోని సెక్షన్ 89,92,93లను రద్దు చేయాలని నిర్ణయం చేస్తే ఎన్పిఆర్డి పోరాటాల ఫలితంగా వెనక్కి తగ్గిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు మినహాయింపు చేయాలని నిర్ణయం చేస్తే కోర్టు తీర్పుతో వెనక్కి తగ్గిందన్నారు. ఎంపీ నిధులలో వికలాంగులకు కేటాయించిన నిధులు ఖర్చు చేయలేదని, కేంద్ర ప్రభుత్వ రంగా సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. రైల్వేలో రాయితీ పాసులు రద్దు చేయడానికి కుట్రలు చేస్తుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా జిల్లా



కేంద్రాల్లో మానసిక వికలాంగులకు హెూమ్స్ నిర్మించాలని 2017 మెంటల్ హెల్త్ కేర్ చట్టంలో ఉన్నప్పటికి అమలు చేయలేదన్నారు. 2016 ఆర్పి డబ్ల్యు, 2017 మానసిక వికలాంగుల చట్టం, నేషనల్ ట్రస్ట్, నేషనల్ పాలసి వంటి చట్టాలు అమలు పట్ల పర్యవేక్షణ లేదు, తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులు, వారి సహాయకులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని చట్టంలో ఎందుకు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు 6000 పెన్షన్ ఎప్పటి నుంచి ఇస్తారన్నారు. హక్కుల సాధన కోసం వికలాంగులంతా ఉద్యమలకు సిద్ధం కావాలని పిలపునిచ్చారు.

జూలై 21,22 తేదీల్లో మెదక్ జిల్లా 7వ మహాసభలు

ఎన్పిఆర్డి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షలు యం.బస్వారాజు, జిల్లా అధ్యక్షురాలు కె.యశోద మాట్లాడుతూ ఎన్పిఆర్డి మెదక్ జిల్లా 7వ మహాసభలు మెదక్ పట్టణంలో జూలై 21,22 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభల్లో జిల్లాలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. మహాసభలకు జిల్లా వ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరు అవుతున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం, గుమ్మడిదల శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి చింతకుంట శ్రీనివాస్, సంతోష్ కుమార్, జిల్లా నాయకులు శ్రీనివాస్, కిష్టయ్య, చెంద్రమ్మ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు..

స్కూళ్లు ప్రారంభమయ్యేలోగా పనులు పూర్తి కావాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సమీక్షించిన కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ - మెదక్

వేసవి సెలవులు ముగిసి స్కూళ్లు ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మరమ్మతు పనులు పూర్తి కావాలని కలెక్టర్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై సంబంధిత అదనపు కలెక్టర్ రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ డీఈ, ఏఈ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల ఆయా స్కూల్లలో తరగతి గదులు, మరుగు దొడ్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యాల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మ ఆదర్శ పాఠశాల కింద తరగతి గదులు, మరుగు దొడ్లలో మరమ్మతు పనులు చేయించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాగు నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. తరగతి గదులలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అవసరం మేరకు ఏర్పాటు చేయాలని వివరించారు. ఆయా పనులు త్వరగా మొదలు పెట్టి నాణ్యతా ప్రమాణాల ప్రకారం పూర్తి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో. పంచాయతీరాజ్ ఈఈ నర్సింలు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, మెప్మా పీడీ ఇందిర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జొన్నల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో



నవతెలంగాణ-ఝరాసంగం

మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను జహీరాబాద్ ఆర్డీవో రాజు శుక్రవారం పరిశీలించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకవచ్చిన జొన్నలను ఎప్పటికప్పుడు తూకం వేసి తీసుకోవాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా ఝరాసంగంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి సమస్యలు లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పలు రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వెంకటేషం, ఆర్ఐ రామారావు తదితరులు ఉన్నారు.

అక్రమ మట్టి తరలింపును అడ్డుకున్న అధికారులు



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని అలీనగర్ గ్రామంలో గల సర్వేనెంబర్ 27లో గల భామణికుంట ప్రాంతం నుంచి అక్రమ మట్టి తరలింపును జిన్నారం మండల రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తహసీల్దార్ బిక్షపతి ఆదేశాలతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ బృందం శుక్రవారం అక్రమ మట్టి తరలింపు వ్యవహారాన్ని అడ్డుకున్నారు. గడచిన కొన్ని రోజులుగా స్థానికంగా భామనుకుంట ప్రాంతం నుంచి అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారని.. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేసిన విషయం విధితమే.



డీపీఓ అకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ఝరాసంగం

మండలంలోని కప్పాడ్, ఝరాసంగం గ్రామ పంచాయతీలను సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) టి.సాయిబాబా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతి ఆస్తులైన డంపింగ్ యార్డ్, స్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, క్రీడా ప్రాంగణలు, పంచాయతీ రికార్డులను పరిశీలించినారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి లక్ష్మయ్య, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శిలు పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ డీలర్లు నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఫర్టిలైజర్ దుకాణ యజమానులు తప్పకుండా నిబంధనలు పాటించాలని.. లేని యెడల వారిపై చర్యలు తప్పవని న్యాల్‌కల్ ఏవో లావణ్య హెచ్చరించారు. న్యాల్‌కల్ మండల రైతు వేదికలో మండలంలోని ఫర్టిలైజర్ డీలర్లకు శుక్రవారం మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ దుకాణాలు రైతులకు అవసరమైన ఎరువులు, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతీ రైతుకు రసీదు ఇచ్చి రైతు సంతకం తీసుకోవాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ తప్పక నమోదు చేయాలన్నారు.



మొక్కలను సంరక్షించాలి

నవతెలంగాణ-ఝరాసంగం

మండలంలోని ఆయా గ్రామాల్లో గల నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని ఎంపీడీవో సుధాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బర్దిపూర్, చిల్లపల్లి గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు మొక్కలను సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. నర్సరీల్లోని మొక్కలు ఎండితే పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట ఏపీఓ రాజకుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



సర్వే నెంబర్ 75లో విల్లాల నిర్మాణ పనులు నిలిపివేత

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని సర్వే నెంబర్ 75లో అక్రమంగా చేపడుతున్న విల్లాల నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు శుక్రవారం నిలిపివేశారు. బొల్లారంలో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ అధికారులు.. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి పనులు నిలిపివేశారు. అంతేకాకుండా విల్లాల ప్రధాన ముఖ ద్వారానికి తాళం వేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ప్రణాళిక నవీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.



నిరుపేదలకు ప్రభుత్వ భూమి పంపిణీ చేయాలి

నవతెలంగాణ-కోహిర్

మండలంలోని నాగిరెడ్డిపల్లిలో 102, 103 సర్వే నెంబర్ గల ప్రభుత్వ భూమిలో 71 ఎకరాలను భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.రామచంద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ.. భూమి కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని దర్జాగా అక్రమ నిర్మాణాలు కడుతున్న వారిని ఏమనకుండా.. నిరుపేదల పట్ల రెవెన్యూ అధికారులు కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి.. నిరుపేదలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోహిర్ మండల్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ , కనకయ్య ప్రభాకర్, సబితా, సుజాత, భూమిలేని పేదలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎయిర్ బ్రేక్ స్విచ్‌లు..





- ఏండ్ల నుంచి పట్టించుకోకపోవడంతో తుప్పు పట్టిన వైనం
- ఏ చిన్న సమస్య వచ్చినా.. సబ్ స్టేషన్ స్థాయి నుంచి అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి
- బ్రేక్ స్విచ్‌లు ఉంటే ఎక్కడికక్కడే బంద్ చేసి మరమ్మతులు చేసుకునే అవకాశం
- ఒక గ్రామంలో సమస్య వస్తే.. మూడు, నాలుగు గ్రామాలకు కరెంట్ కట్
- ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలి

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని చాలా గ్రామాల్లో విద్యుత్ నియంత్రికల వద్ద ఎయిర్ బ్రేక్ స్విచ్‌లు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడో 50 ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎయిర్ బ్రేక్ స్విచ్‌లు కొన్నిచోట్ల తుప్పు పట్టి మరి కొన్నిచోట్ల పనిచేయకుండా పోయాయి. దాంతో ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు మరమ్మతు చేసుకోవాలంటే తీవ్ర జాప్యం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎయిర్ బ్రేక్ స్విచ్‌లు సరిగ్గా ఉంటే.. ఏదైనా తాత్కాలిక మరమ్మతు వచ్చినప్పుడు విద్యుత్ సిబ్బంది గానీ చిన్నపాటి మరమ్మతులు వచ్చినప్పుడు గ్రామస్తులు కానీ మరమ్మతు చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్నపాటి విద్యుత్ సమస్య ఏర్పడినప్పటికీ విద్యుత్ లైన్ క్లియర్ నిమిత్తం అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. దీంతో సంబంధిత సబ్ స్టేషన్ల నుంచి సకాలంలో లైన్ క్లియర్ దొరకక సరఫరాలో తీవ్ర జాప్యం ఏర్పడుతున్నది. ఒక గ్రామంలో విద్యుత్ సంబంధమైన సమస్య ఏర్పడితే లైన్ క్లియర్ నిమిత్తం మూడు నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తున్నది. అంతేకాకుండా రైతులు బోరు బావుల వద్ద విద్యుత్ కనెక్షన్ తెగిపోయినప్పుడు కానీ, ఏదైనా చిన్నపాటి మరమ్మతు వచ్చినప్పుడు సబ్ స్టేషన్ స్థాయి నుంచి లైన్ క్లియర్ తీసుకోవాల్సి వస్తున్నది. దాంతో సకాలంలో విద్యుత్ సరఫరా జరగక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో వీధి దీపాలు బిగించాలంటే కనీసం నాలుగైదు గంటలు పడుతుంది. దీనికోసం లైన్ క్లియర్ తీసుకోవాలంటే ఒక వారం నుంచి అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి వస్తున్నదని గ్రామపంచాయతీ కార్యదర్శులు సైతం వాపోతున్నారు. ఒక గ్రామంలో విద్యుత్ సంబంధమైన సమస్య తలెత్తినప్పుడు గాని వీధి దీపాలు ఏర్పాటు చేసినప్పుడు గానీ.. పక్కన ఉన్న రెండు మూడు గ్రామాలకు గంటలు తరబడి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే గ్రామంలోని విద్యుత్ నియంత్రికల వద్ద ఎయిర్ బ్రేక్ స్విచ్‌లు సజావుగా పనిచేస్తే ఎక్కడి మరమ్మతులు అక్కడే చేసుకుని ఇతరులకు ఇబ్బంది కాకుండా సకాలంలో సేవలు వినియోగించుకునే వారమని పలువురు చెబుతున్నారు. ఈ విషయంపై మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రశాంత్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించలేదని పలువురు ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఆ అధికారి ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉండక ఎక్కువ శాతం డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలోనే ఉంటూ ప్రజా ప్రతినిధులకు ఇటు ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారని ఆరోపించారు. చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయే స్థితిలో ఉన్నాయని.. దాంతో ప్రజలు తీవ్ర భయాందోళన మధ్య కాలం వెల్లదీ స్తున్నారు. చాలా గ్రామాల్లో వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్న ప్పటికీ అటు గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని కానీ సంబంధిత అధికారులను గాని విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయం చేయడంలో విద్యుత్ శాఖ వైఫల్యమైనట్టు కనిపిస్తోంది.

ఎయిర్ బ్రేక్ స్విచ్ ఏర్పాటు విషయమై విద్యుత్ శాఖ మునిపల్లి మండల ఏఈ ప్రశాంత్‌ను వివరణ కోరగా.. ఎయిర్ బ్రేక్ స్విచ్ విషయం తనకు తెలియదని అవసరమైతే డివిజనల్ ఇంజనీర్‌ను సంప్రదించాలని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదు



ఈ విషయమై అనేకమార్లు సర్వసభ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారి ప్రశాంత్ దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహించారు. ఎయిర్ బ్రేక్ స్విచ్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చిన్నచిన్న సమస్యలకు లైన్ క్లియర్ తీసుకోవాల్సి వస్తుంది. దీంతో రెండు గ్రామాల విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

– ఎర్ల శంకర్, అంతారం మాజీ సర్పంచ్

ఏ చిన్న సమస్య వచ్చినా.. రాత్రంగా అంధకారమే



మా గ్రామాల్లో విద్యుత్ నియంత్రికల వద్ద ఎయిర్ బ్రేక్ స్విచ్ లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం. ఒకవైపు రైతులు.. మరోవైపు గ్రామంలో విద్యుత్ సమస్య వస్తే ఒక రాత్రంతా అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ మధ్యలోనే అలాంటి సమస్య ఎదుర్కొన్నాం. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎయిర్ బ్రేక్ స్విచ్ ఏర్పాటు చేయాలి.

– సంగన్న, మేళాసంఘం మాజీ ఉపసర్పంచ్

ఎయిర్ స్విచ్‌లు లేక తీవ్ర ఇబ్బందులు



గ్రామంలో ఏదైనా విద్యుత్ సమస్యలు వచ్చినా, వీధి దీపాలు మార్చాలన్నా నియంత్రికల వద్ద ఎయిర్ బ్రేక్ స్విచ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయి. ఈ విషయంపై మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో అనేకమార్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రశాంత్ దృష్టికి తీసుకెళ్ళాము.. అయినా ఫలితం లేదు. ఇప్పటికైనా గ్రామాల్లో ఎయిర్ బ్రేక్ స్విచ్ ఏర్పాటు చేయాలి.

–అశోక్, మొగ్దుంపల్లి మాజీ సర్పంచ్

కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

వరిధాన్యం కొనుగోలు కేంద్రాల గల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను పౌరసరఫరాల కమిషనర్ భారతి హోళికేరి ఆదేశించారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. తూకం ఎన్ని కిలోలు వేస్తున్నారో వారిని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేయడంలో ఎలాంటి అవకతవకలు జరగకూడదని అధికారులకు తెలిపారు. ధాన్యం తరలించడానికి వాహనాల కొరత ఉన్నదని సంబంధిత అధికారులు తెలియజేయడంతో మెదక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో మాట్లాడి.. గుమ్మడిదల మండలానికి లారీలను వెంటనే పంపించాలని ఆదేశించారు. అకాల వర్షాలకు తడవకుండా ఎప్పటికప్పుడు రైతుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెట్టుకున్న అనంతరం తూకం వేయాలన్నారు. జూన్ 15వ తారీఖు వరకు వరి ధాన్యం కొనుగోలు పూర్తి కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, డీఏఓ నర్సింహా రావు, సివిల్ సప్లయి డీఎం కొండల్ రావు, డీఎస్ఓ అరుణ, డిప్యూటీ తహసిల్దార్ కర్ణాకర్ రావు, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, మండల సహకార సంఘం చైర్మెన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏఈఓలు, లక్ష్మణ్ నాయక్, రైతు సంఘ అధ్యక్షుడు పోచుగారి మోహన్ రెడ్డి. రైతులు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్లు కొనుగోలు చేయా లన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టొద్దన్నారు. వడ్లను సక్రమంగా కొనుగోలు చేస్తున్నారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ అనుదీప్, ఆర్ఐ శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం !

పెచ్చులూడుతున్న స్తంభం, తేలిన ఇనుపరాడ్లు.. పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని మేదపల్లి గ్రామంలో కొన్నేండ్ల క్రితం జనావాసాల మధ్య.. ఇండ్ల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ నెలకొల్పారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కి రెండు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే ఇవి ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయని.. పెచ్చులూడి ఇనుప రాళ్లు బయటికి వచ్చాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వాటితో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందేమోనని భయం గుప్పిట్లో కాలం వెల్లదీస్తున్నారు. స్థానిక అధికారి పట్టించుకోకపోవడం, పర్యవేక్షణ లోపం వల్ల సరైన నిర్వహణ కొరబడిందని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై పలుమార్లు స్థానిక అధికారికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగితే గానీ అధికారులు స్పందించరా? అంటూ ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో భారీ వానలకు ఆ విద్యుత్ స్తంభాలు కూలి ఇండ్లపై పడే అవకాశాలు ఉన్నాయని.. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



ప్రజాసేవలో ఎల్ఐసీ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రజాసేవలో ఎల్ఐసి సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమైనవని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. జహీరాబాద్ డీఎస్పీ రామోహన్ రెడ్డికి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ శ్రీనివాస రాజు కలిసి సేవా విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి సంస్థ గతేడాది సాధించిన విజయాలు, సమాజానికి చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు వివరించారు. క్లెయిమ్ సెటిల్మెంట్‌లో, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విషయాల్లో ముందంజలో ఉన్న విషయం ఎంతో మెచ్చుకోతగ్గ విషయంగా డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏబీఎంజే సుధాకర రావు, డీఓకే రాజు, లైఫ్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు ఆర్ సుభాష్, స్టాఫ్ యూనియన్ సెక్రటరీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పామ్ ఆయిల్ పంట లాభాదాయకం



నవతెలంగాణ-మనూర్

పామ్ ఆయిల్ పంట రైతులకు మంచి లాభాదాయకం అని గోద్రెజ్ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. మనూర్ రైతు వేదికలో రైతులకు పామ్ అయిల్ మొక్కల పెంపకం పైన శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. పామ్ ఆయిల్ మొక్కలు ప్రభుత్వం ద్వారా సబ్సిడీ కింద పంపిణీ చేస్తామని.. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా.. వేరే రైతులకు 80శాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు. ఈ పంట పండించే రైతులకు ప్రోత్సాహం కింద ఏడాదికి రూ.4200 ఇవ్వనున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పామ్ ఆయిల్ మొక్కలు పండడానికి వాతావరణం అనుకూలం ఉందన్నారు. రైతులు అధిక సంఖ్యలో సాగు చేసి లాభం పొందాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ అధికారులు బి.మహేష్, సంగమేశ్వర్, సాయిచరణ్‌రెడ్డి, ఎం.ప్రవీణ్, గోద్రెజ్ క్షేత్ర అధికారి అజయ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-జోగిపేట

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం ఆందోలు, జోగిపేట మున్సి పల్ కార్యాలయంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సమన్వయకర్త పల్లవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళా చట్టాలను గురించి, ఆడపిల్లల ప్రాముఖ్యతను గురించి, బాల్య వివాహాల నిర్మూలన గురించి, మహిళా పథకాలను గురించి హెల్ప్ లైన్ నంబర్స్ గురించి వివరించారు. మున్సి పల్ కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ.. మహిళా చట్టాల గురిం చి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అన్ని రంగా ల్లో మహిళలు ముందుండాలన్నారు. ఈ కార్య క్రమంలో మెప్మా కోఆర్డినేటర్ బిక్షపతి, టిఎంసి అండ్ జెండ ర్ స్పెషలిస్ట్ విశాల, డీఎల్ఎఫ్ మెంబర్స్, రిసోర్స్ పర్సన్స్ తదిత రులు పాల్గొన్నారు.

చరిత్రకు ఆనవాళ్లు పురాతన కట్టడాలు

- కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్

చరిత్రకు ఆనవాళ్లు అయిన మజీద్‌ను పరిశీలిస్తున్న పురాతన కట్టడాలు పర్యాటకులను కనువిందు చేస్తాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ మండలం కొంటూరు గ్రామ శివారులోని పురాతన మసీదును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీస్తుపూర్వం 500 సంవత్సరాల క్రితం ఈ మజీద్‌ను నిర్మించడం జరిగిందన్నారు. ఈ కట్టడంలో చిన్నచిన్న మరమత్తులకు లోనుకావడం జరిగిందని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పురావస్తు శాఖ, వక్ఫ్ బోర్డ్ అధికారులతో సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ

మెదక్

3

శనివారం | 25 మే 2024 | www.navatelangana.com

బూరుగుపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యం

హవేలీ ఘనపూర్ ఎస్సై ఆనంద్ గౌడ్

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన కప్పల సత్యనారాయణ ఈ నెల 17 తారీఖున కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని శ్రీ శబరిమాత ఆలయంలో దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని కప్పల సత్యనారాయణ భార్య నాగమణి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ శుక్రవారం తెలిపారు. కప్పల సత్యనారాయణ తెల్ల రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంట్ కలదని ఎస్ఐ తెలిపారు. పైన పేర్కొన్న వ్యక్తి ఎవరికైనా కనబడినట్లైతే హవేలీ ఘనపూర్ పోలీస్‌లకు సమాచారం ఫోన్ నెంబర్‌కు 87126 57921 ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు.

రైతులకు అందుబాటులో జనుము విత్తనాలు

- వ్యవసాయ అధికారి స్రవంతి

నవతెలంగాణ-మనోహరాబాద్

మనోహరాబాద్ మండలంలోని రైతులకు జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మనోహరాబాద్ వ్యవసాయ అధికారి స్రవంతి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరమున్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు ఆదార్ కార్డును తీసుకువచ్చి విత్తనాలను తీసుకోవచ్చని తెలిపారు. జనుము విత్తనాల 40 కిలోలు రూ.1448 లు ఉంటుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి స్రవంతి తెలిపారు.

ఆయిల్ ఫామ్ సాగులో సస్యరక్షణ చర్లపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండలంలోని లావణ్య ఆయిల్ ఫామ్ తోటల్లో రైతులకు ఆయిల్ ఫామ్ సాగులో సస్యరక్షణ సమగ్ర యజమాన్య జాగ్రత్తల గురించి శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫామ్ లివింగ్ ఫుడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రంగనాయకులు జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సయ్య మండల ఉద్యాన శాఖ అధికారులు ఆయిల్ ఫామ్స్ సిబ్బంది డ్రిప్ కంపెనీ ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఆయిల్ ఫాం పండిస్తున్న 90 మంది రైతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారి ఉద్దేశించి కన్సల్టెంట్ డాక్టర్ బి.ఎస్.రావు పంట సాగులో చెప్పటవలసిన చర్యలు వివరంగా తెలియజేశారు. ఈ శిక్షణ సదస్సు సాగు చేస్తున్న రైతులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆయిల్ ఫామ్ తోటలను ఎప్పటికప్పుడు చెట్టు మొదల్లో కొత్త మట్టిని చేర్చి అధిక పోషకాలు మొక్కకందే విధంగా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ఏ ఈ ఓ రజిత రైతులు పాల్గొన్నారు.

ధాబాలో కంటైనర్ లారీలో పడుకున్న డ్రైవర్ మృతి

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధిలోని వల్లూరు గ్రామ శివారులో జాతీయ రహదారి 44 పై ఉన్న రాజస్థానీ జోధపూర్ ధాబా లో శుక్రవారం ఉదయం 2:30 ప్రాంతంలో మాధవ్ పూర్, సికార్ జిల్లా రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్ మనోజ్ కుమార్ (34) తన కంటైనర్ లారీ జీజే 17యు యు 8921 ను ధాబా లో నిలిపాడు. అనంతరం ధాబా లో స్నానం చేసి భోజనం చేసి తన లారీలో పడుకున్నాడు. తెల్లారేసరికి రాత్రికి వచ్చిన వాహనాలు అన్ని వెళ్ళిపోయినా, మనోజ్ కుమార్ వాహనం వెళ్లక పోవడం తో ధాబా యజమాని అయిన బిష్ణోయి మనీష్ లారీ వద్దకు వెళ్ళి చూడగా మనోజ్ కుమార్ పడుకుని కనిపించాడు. ఎంత పిలిచినా లేవకపోయేసరికి అనుమానం వచ్చి లారీ ఎక్కి చూడగా అతను మృతి చెంది ఉన్నాడు. ధాబా యజమాని విషయాన్ని వెంటనే నార్సింగి పోలీసులకు తెలియపరచగా ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దిన్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు. లారీ డ్రైవర్ మనోజ్ కుమార్ నిద్రలో గుండె పోటు రావడంతో మృతి చెందాడని ప్రాథమిక విచారణలో తేల్చారు. మృత దేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ధాబా యజమాని బిష్ణోయి మనీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- మండల వ్యవసాయ అధికారి నాగమాధురి



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి నాగమాధురి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 గాను కాలం చెల్లిన విత్తనాలు రైతులకు అమ్మ రాదని నకిలీ విత్తనాలు అమ్మకుండా చూడాలని డీలర్లకు సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేశాక రైతులకు బిల్లు విధిగా ఇవ్వాలని డీలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

నస్కల్ రోడ్డుకు బీటి వేసేది ఎప్పుడు?

- కాసులు కాంట్రాక్టర్లకు కష్టాలు ప్రజలకా?
- అంటున్న మండల ప్రజలు
- దాదాపు పది సంవత్సరాల నుంచి అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- బీటీ రోడ్డు వేసేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు

నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రం నుండి నస్కల్ రోడ్డు బాగలేక దాదాపు పది సంవత్సరాల నుంచి ప్రజలు అనేక కష్టనష్టాలకు గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం దాదాపు రూ.60 కోట్ల ను మంజూరు చేసిన విషయము మండల ప్రజలకు తెలుసు. చల్మెడ, కమాన్ నుండి నందగోకుల్, రాంపూర్, నస్కల్ నుండి నిజాంపేట వరకు బీటీ రోడ్డు పనులకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి దాదాపు 1 సంవత్సరం గడుస్తుంది. కంకర పోసి ఇప్పటికీ 7 నెలలు అవుతున్నప్పటికీ నేటికీ బీటీ రోడ్డు వేయకపోవడమేమిటని గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కంకర రోడ్డుపై వాహనాలు రావడంతో అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు. కాసులు కాంట్రాక్టర్లకు కష్టాలు మాకా? అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే పనులు జరగడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఆర్ అండ్ బీ , ఏఈని వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు నోటీసులు కూడా ఇవ్వడం జరిగిందని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఒత్తిడి చేయడం జరిగిందని ఇట్టి విషయాన్ని పై అధికారులకు కూడా తెలపడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్ కెసిఆర్ బంధువని విశ్వసనీయ సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినట్లయితే బిల్లులు తొందరగా వచ్చేవని ఇప్పటికీ దాదాపు 20 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున పనులు చేయడం లేదని విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వం మారడం వలన పనులు జాప్యం జరుగుతుందని ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వాలు మారడంతో ప్రజల కష్టాలు తీరుతాయేమో అనుకుంటే కష్టాలు ఇంకా ఎక్కువ అవుతున్నాయని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకొని వెంటనే బిటి రోడ్డు వేసేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వెంటనే బిటి రోడ్డు వేయాలి

గూగులోత్ కిషన్ నగరం వాసి



నగరం నుంచి నిజాంపేట మండల కేంద్రానికి రావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఏ చిన్నపాటి పని పడిన నిజాంపేట గ్రామానికి రావాలి రాత్రి పూట ప్రయాణం చేయాలంటే అనేక యాక్సిడెంట్లు అవుతున్నాయని ప్రయాణం చేయాలంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి వెంటనే డాంబర్ రోడ్ వేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

దగ్గర పడుతున్న ఓట్ల లెక్కింపు సమయం

- ఉత్కంఠతలో మూడు పార్టీల నాయకులు మెదక్‌లో త్రికోణ పోటీ
- కొద్ది మెజారిటీతోనే గెలుపు అంటున్న నాయకులు
- పైకి గంబీరంగా ఉన్నా లోలోపల మాత్రం ఉత్కంట

నవతెలంగాణ - మనోహరాబాద్

పార్లమెంటు ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతున్న తరుణంలో మూడు పార్టీల నాయకుల్లో తీవ్ర ఉత్కంట నెకొంటోంది. ఇప్పటికే మూడు పార్టీల నాయకులు గెలుపు తమదంటే తమదేనంటు గంబీరంగా చెబుతున్నప్పటికి లోలోపల మాత్రం ఉత్కంటతో ఉన్నట్టు తెలుస్తుంది. మెదక్ పార్లమెంటులో మాత్రం మూడు పార్టీలు ధీటుగా తలపడుతున్నాయి. మెదక్‌లో త్రికోణ పోటీ నెలకొంటుంది. అటు బీజేపిలో మాత్రం యువతతో పాటు మోధీ చరిష్మా పనిచేసిందనే చెప్పాలి. మెదక్‌లో మాత్రం బీజేపికి సైలెంట్ ఓటింగ్ జరిగినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరో వైపు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఇక్కడే సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా సేవలందించడంతో పాటు ప్రజలకు దగ్గరైన అధికారిగా పేరుంది. కాగా రాజకీయాలపై ఉన్న మక్కువతో కలెక్టర్‌కు రాజీనామా చేసి ప్రజా సేవ చేవచేయాలనే లక్ష్యంతో గతంలోనే బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశిస్సులతో ఎంఎల్‌సీగీ ఎన్నికయ్యారు. అనంతరం కేసీఆర్ మెదక్ పార్లమెట్‌కు అభ్యర్థిగా ఎంపిక చేశారు. దాంతో పాటు అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డి తనదైన శైలిలో ప్రచారం నిర్వహించడంతో పాటు తానను ఎంపీగా గెలిపిస్తే నిరుద్యోగ యువత కోసం వంద కోట్లతో ట్రస్టును ఏర్పాటు చేసి ఉపాదికల్పించనున్నట్టు ప్రజచారం చేయడం కూడా వెంకట్‌రాంరెడ్డికి కలిసివస్తుందనే చెప్పాలి. దాంతో పాటు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలలో బీఆర్ఎస్‌పై అభిమానాన్ని నిలిపింది. దాంతో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డికి ప్రజల మద్దతు ఉందనే ఆలోచనలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా కాంగ్రేస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ బీసి బిడ్డగా ముదిరాజ్ నినాదంతో పాటు అధికారంలో ఉన్న కాంగ్రేస్ పార్టీ ప్రజచారాలు కలిసి వచ్చే అవకాశం ఉంది. దానికి తోడు బీఆర్ఎస్‌ పార్టీలో ఉన్న ముఖ్య నాయకులు బీఆర్ఎస్ పార్టీలో ఇమడలేక కాంగ్రేస్ పార్టీలో చేరడంతో పాటు ఇతర నాయకులు కూడా కాంగ్రేస్ వైపు వచ్చారు. దాంతో కాంగ్రేస్‌కు నాయకుల మద్దతు పూర్తిగా పెరిగింది. అయినప్పటికి కాంగ్రేస్ చేపట్టిన ఆరు గ్యారెంటీలు కలిసి వచ్చే అవకాశం ఉందనే చెప్పాలి. ఏది ఏమైనా మూడు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు ప్రచారాలు చేయడంతో ప్రజలు ఏపార్టీ వైపు మొగ్గు చూపారో వచ్చే నెల నాలుగున జరిగే ఓట్లలెక్కింపుతో బయటపడే అవకాశం ఉంది. కానీ మెదక్‌లో మాత్రం మూడు పార్టీలు ఏకధీటిగా ప్రచారాలు చేయడంతో పాటు గెలుపు ఎవరిదో అనే ఆలోచనలో ఓటర్లు ఉన్నారు,.. ఏపార్టీ అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుంది. ఏ అభ్యర్థికి ప్రజలు మొగ్గు చూపారనే దానిపై వచ్చే నాలుగు వరకు వేచి చూడాల్సింది.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- దొడ్డు రకం ధాన్యానికి సైతం రూ.500 బోనస్ ఇవ్వాలి.
- ఎమ్మెల్యే సునీత రెడ్డి



నవ తెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని అదేవిధంగా దొడ్డు రకం ధాన్యానికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో స్థానిక విలేఖరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదన్నారు. పంటల పెట్టుబడికి రైతుబంధు ఇవ్వడం లేదని పంటలకు కరెంటు సక్రమంగా సరఫరా చేయడం లేదన్నారు. పండించిన పంటలను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి వస్తే కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి పడిగాపులు కాసిన కొనుగోలు చేయడం లేదని అన్నారు లారీల కొరత ఏర్పడడం వల్ల రైతుల ధాన్యాన్ని అన్లోడ్ చేయకపోగా రోడ్లపైనే వేసి రైతులు పడిగాపులు కాస్తున్నారు. అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దొడ్డు రకంధాన్యానికి కాకుండా సన్న రకానికి రూ.500 బోనస్ ఇస్తామనడం ఎంతవరకు సమంజసం ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీలుగా జన్మ విత్తనాల కొరత ఏర్పడి రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విత్తనాల కొరత లేదన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమించి రైతుల అభివృద్ధికి పాటు పడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, నాగరాజుగౌడ్, సుధాకర్ రెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేసిన వ్యవసాయ విస్తరణ అధికారి

నవతెలంగాణ-నార్సింగి

వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని నార్సింగి వ్యవసాయ విస్తరణ అధికారిని విజృంభణ అన్నారు. మండల వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐదు విత్తన విక్రయ కేంద్రాలు ఉన్నాయని రైతులకు తెలియపర్చారు. రైతులు నకిలీ విత్తనాలు అరికట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ లూజుగా ఉన్న విత్తనాల సంచి కొనుగోలు చేయకూడదని, సంచి కుట్టే సమయంలో సంచి మడతలతో పాటు విత్తనాలు తయారు చేసిన తేదీ, బ్యాచ్ నెం తదితర వివరాలు తెలియజేసే లేబిల్‌ను గమనించి కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదును తప్పని సరిగా తీసుకోవాలని, సంచితో పాటు వచ్చిన లేబిల్‌ను, రసీదును పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్ర పరుచు కోవాలని అన్నారు. తద్వారా నకిలీ విత్తనాలు వచ్చినట్లయితే అమ్మిన వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. జీలుగ జునుము పంటకు యూరియా వాడకూడదని, యూరియా వాడితే గడ్డి ఎత్తు పెరుగు తుందన్నది అపోహ మాత్రమే అని, ఎత్తు పెరగక పోయినా వాటి వేర్ల వల్లనే భూమికి నత్రజని అంది బలం చేకూరుతుందని వివరించారు. వరి కోయలను కాల్చ కూడదని, కాల్చడం వల్ల పొలానికి నష్టం కలుగుతుందని, వాయు కాలుష్యం జరుగుతుందని అది అందరికీ ప్రమాదకరం అని అన్నారు. వరి కోయలను పొలం లోనే ఉంచి జీలుగ జునుము విత్తనాలు వేసుకోవాలని, 45 రోజుల పంట కాలం అనంతరం జిలుగ జునుము తో పాటు దున్నివేయాలని, కోయల వల్ల ఏర్పడ్డ సూక్ష్మ జీవుల ద్వారా భూమికి శక్తి చేకూరుతుందన్నారు.



గుర్తింపు ఉన్న షాపులోనే విత్తనాలు కొనాలి

- ఏడిఏ పుణ్యవతి



నవతెలంగాణ-కౌడిపల్లి

ప్రభుత్వం నుంచి గుర్తింపు కలిగి ఉన్న ఫర్టిలైజర్ షాపులలోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని కౌడిపల్లి వ్యవసాయ అధికారిని పుణ్యవతి తెలిపారు. శుక్రవారం చిలిపిచెడ్, కౌడిపల్లి, కొల్చారం మండలాల విత్తన, ఎరువుల షాపుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ విత్తనాలు ఎరువులు కొనే రైతుల ఆధార్ కార్డు, పాస్ బుక్ పూర్తి వివరాలు తీసుకొని పంపిణీ చేయాలన్నారు. షాపు యజమానులు ఇచ్చిన రషీద్ పత్రాన్ని, విత్తనాల ప్యాకెట్లను పంట అయిపోయేంత వరకు రైతులు భద్రపరచుకోవాలన్నారు. ఇచ్చిన విత్తనాలు నకిలీవి అయితే వెంటనే రసీదుతో పంట నష్టం కింద పరిహారం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన షాపుపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. విత్తనాలు, ఎరువులు అమ్మే డీలర్లు గుర్తింపు పొందిన వారే విక్రయించాలని తెలిపారు. ఫర్టిలైజర్ షాపుల డీలర్లు రైతుల వద్ద అధిక డబ్బులు వసూలు చేస్తూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంతమంది రైతులు ఏఏ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారనేది రిజిస్టర్ మెయింటెనెన్స్ కచ్చితంగా చేసి ఉండాలని లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు. నేటి నుంచి ప్రతి గ్రామపంచాయతీలో ఎరువులు విత్తనాలపై రైతులకు వారి వారి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు అవగాహనలో రైతులు ఎలాంటి భూమిలో ఎలాంటి విత్తనాలు వేస్తే దిగుబడి వస్తుందన్న విషయాలు, చీడపీడల నివారణకు అవసరమయ్యే సూచనలు సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏవోలు, ఎరువులు, విత్తనాల డీలర్లు పాల్గొన్నారు.

అనుమాన స్పద స్థితిలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-టేక్మాల్

అనుమానస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో వైన్స్ వద్ద చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లాస్ పూర్ గ్రామానికి చెందిన గుంటి రాజు (30) వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. యాసంగి వరి కోత కోసి టేక్మాల్ లోని పిఎసిఏస్ వరి కొనుగులో కేంద్రంలో విక్రయించేందుకు ఉంచాడు. తల్లి రాములమ్మతో గురువారం ఉదయం కొనుగోలు కేంద్రం వద్దకు ఇరువురు వచ్చారు. కొనుగోలు కేంద్రంలో వడ్లను విక్రాయించక పోవడంతో తల్లి రాములమ్మ స్వగ్రామానికి వెళ్ళింది. రాజు సుమారు 6:30సమయంలో టేక్మాల్‌కు చెందిన చింత భూమాయ్య తల్లి రాములమ్మకు ఫోన్‌లో రాజు మరణించినట్లు తెలిపారు. వచ్చి చూడగా రాజు విగత జీవిగా ఉన్నాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి రాములమ్మ తన కుమారుడిని ఎవరో హత్య చేశారని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ దయానంద్ తెలిపారు.

కుమారుడిని హత్య చేశారు

తన కుమారీడిని హత్య చేశారని, తనకు న్యాయం చేయాలని మృతుడి తల్లి రాములమ్మ పోలీస్ స్టేషన్‌లో బైఠాయించారు. జోగిపేటలో పోస్టుమార్టం నిమిత్తం టేక్మాల్ వైన్స్ షాపు ముందు మృతదేశాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. తన కూరరుడు రాజును పరిమిట్ రూమ్ యజమాని హత్య చేశారని మృతడి బంధువులు కొద్దీ సేపు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో మృతుడి బంధువులు మృతదేహన్ని పోలీస్ స్టేషన్ వద్ద ఉంచి బైఠాయించారు. దీంతో విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి టేక్మాల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని మృతుని బంధువులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసిన వారు వినలేదు. పరిమిట్ రూమ్ యజమానిని అదుపులోకి తీసుకొని శాఖపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని తెలపడంతో మృతుడి బంధువులు మృతదేహన్ని తీసుకొని స్వగ్రామానికి వెళ్లారు.

స్మశాన వాటిక పనులపై డిపిఓ యాదయ్య అసహనం

నవతెలంగాణ-కౌడిపల్లి



స్మశాన వాటిక పనులు పూర్తి కాకపోవడంతో డిపిఓ యాదయ్య అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని స్మశాన వాటిక అసంపూర్తి పాలను చూసి డిపిఓ యాదయ్య కాంట్రాక్టర్ పంచాయతీ రాజ్ ఏఈ ప్రభాకర్ అందుబాటులో లేకపోవడంతో స్మశాన వాటిక నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేయడంపై ఫోన్‌లో నిలదీశారు. జిల్లాలో అన్నిచోట్ల స్మశాన వాటిక నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ కౌడిపల్లి టౌన్‌లో అసంపూర్తి పనులు ఎందుకు మిగిలి పోయాయని ప్రశ్నించారు. మిగిలిపోయిన అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పల్లె ప్రకృతి వనంలో ఎండలు ఎక్కువగా ఉన్నందున మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీళ్ల పెడుతూ జాగ్రత్తగా ఉండాలన్నారు. డంపింగ్ యార్డ్‌లో తడి పొడి చెత్త విషయంలో పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యత వహించి నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం అప్పగించిన ప్రతి పనిని బాధ్యతగా నిర్వహించాలి కానీ ఇష్టం వచ్చినట్లు పనులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.

కారు పల్టీ కొట్టడంతో ఒకరు మృతి



నవతెలంగాణ- చిన్న శంకరంపేట

కారు పల్టీ కొట్టడంతో ఒకరు మృతి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని టీ మాందాపూర్ శివారులో గల మెదక్ నుంచి చేగుంట ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. అదే సమయంలో అటు వెళుతున్న ప్రయాణకులు తెలిపిన వివరాల ప్రకారం చేగుంట నుంచి మెదక్ వైపు వెళుతున్న ఎరుపు రంగు కారు అతివేగంగా అజాగ్రత్తగా మద్యం సేవించి కారు నడపడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఆత్రుతతో కార్ హ్యాండిల్ బ్రేక్ వేయడంతో కారు రెండు పల్టీలు కొట్టిందని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్ సహాయంతో మెదక్ దవఖాన తరలించారని తెలిపారు. ప్రమాదానికి గురైన కారు మెదక్ నవీపేటకు చెందిన వ్యక్తులుగా తెలిపారు. ఘటన స్థలానికి చిన్న శంకరంపేట పోలీసులు చేరుకున్నారు.

మానవత్వం చాటుకున్న యువకులు

నవతెలంగాణ-నంగునూరు



మండలం గట్లమల్యాల గ్రామానికి చెందిన ముడికి వెంకటేష్ (24)కు ఆ గ్రామానికి చెందిన యువకులు రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వం చాటుకున్నారు. జీవనోపాధి కోసం సిద్దిపేటలో వెంకటేష్ సెంట్రింగ్ పని చేస్తూ అకస్మాత్తుగా కరెంటు షాక్‌కు గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్లో చికిత్స పొందాడు. తన రెండు చేతులు తీవ్రంగా గాయపడడంతో మోచేయి వరకు రెండు చేతులను డాక్టర్లు తొలగించారు. వెంకటేశ్ దీన పరిస్థితి తెలుసుకున్న పదవ తరగతి 2016-17 బ్యాచ్, ఇదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు ఎడ్ల నర్సింహారెడ్డి, చిలుక వెంకటయ్యలు కలిసి సహాయం అందజేశారు.

వైకుంఠ రథం ప్రారంభం


నవతెలంగాణ-అక్కన్నపేట



నార్లపురం రామయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు లక్ష్మీ చంద్రమౌళి, రవీందర్‌లు మండల కేంద్రానికి వైకుంఠ రథాన్ని బహుకరించారు. ఈ రథాన్ని శుక్రవారం మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన వారి పార్థీవ దేహాన్ని తీసుకెళ్లడానికి రథాన్ని బహుమతిగా ఇచ్చిన వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సన్నపేటలో నాభిశిలా వార్షికోత్సవ మహోత్సవం

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని నర్సన్నపేట గ్రామంలో బొడ్రాయి నాభిశిలా విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం పది జంటల దంపతులతో హెూమ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మర్కుక్ జెడ్పీటీసి యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ కానుగంటి మాధవి రాజిరెడ్డి, భీంరెడ్డి వినోద రాంరెడ్డి, మంజుల ఎల్లారెడ్డి, పూడెం పూజా రాంరెడ్డి, లావణ్య మహిపాల్ రెడ్డి, లక్ష్మీ మల్లారెడ్డి, బాల్ లక్ష్మి రాజిరెడ్డి, శైలజ వెంకటేష్, పద్మ ఐలయ్య, రంగా గీత నర్సింలు గౌడ్, దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ భీంరెడ్డి బాల్ రెడ్డి, వేద పండితులు రాధాపతి బృందం, గ్రామస్థులు, శ్రీనివాస్‌రెడ్డి, యాదవరెడ్డి, దేశాయిరెడ్డి, మదుసూదన్ రెడ్డి, తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

31వ తేది లోపు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలి


నవతెలంగాణ-తొగుట

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 31వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఆధార్ కార్డు జిరాక్స్, ఐదవ తరగతి చదివినట్లుగా బోనఫైడ్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7893163472, 7702379220 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న వరదరాజుల బ్రహ్మోత్సవాలు

- హనుమాన్ భక్తులకు మహా అన్నదానం

నవతెలంగాణ-మర్కుక్




మండల పరిధిలోని వరదరాజపూర్ గ్రామంలోని రెండో కంచిగా బాసిల్లుతున్న పుణ్యక్షేత్రం వరదరాజుల స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీశ్రీశ్రీ భూనీళా సమేత వరదరాజుల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం వరదరాజుల స్వామి దంపతులకు విశేష పూజలు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో హనుమాన్ మూలాధారులకు దాత ఉమ్మడి మెదక్ జిల్లా సహకార సంఘం డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి సౌజన్యంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ అప్పాల ప్రవీణ్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాత ఉమ్మడి మెదక్ జిల్లా సహకార సంఘం డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలకు స్వామి వారి కళ్యాణానికి పూలపందిరి, టెంటు, భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి ఎల్ఈడి స్క్రీన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వారికి స్వామి వారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు. సాయంత్రం హరికథ కాలక్షేపం తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహెరా నరేష్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ దంపతులు అప్పాల స్వాతి ప్రవీణ్ కుమార్, ఆలయ పూజారులు వర్దాచారి, గోపాల చారి, పురుషోత్తం చారి, వరదరాజుల స్వామి దేవాలయ భక్తులు ఆంజనేయ స్వామి భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందన

- గ్రామంలో మిషన్ భగీరథ డీఈ, ఏఈలు పరిశీలన

నవతెలంగాణ-మర్కుక్



గ్రామంలో త్రాగు నీటి కొరత అనే శీర్షికతో నవతెలంగాణలో శుక్రవారం వార్తా కథనం ప్రచురించగా మీషన్ భగీరథ డీఈ సుమలత, ఏఈ తిర్మల్ రెడిల్లు మండలంలోని శివారు వెంకటాపూర్ గ్రామానికి చెరుకుని నీటి సమస్య పరిష్కారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి నీటి కొరత లేదని, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను క్షుణ్ణంగా పరిశీలించి గ్రామంలోని పలు కాలనీలకు నల్లాల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలకు చూపించారు. వాటర్‌మెన్‌కు గత 6 నెలలుగా జీతాలు రాకపోవడంతో తాను సరిగా పనిచేయడం లేదని గ్రామస్థులు తెలిపారన్నారు. దీంతో సరైన సమయంలో నీళ్ళను వదలకపోవడం, వదిలిన గెట్ వాల్‌ను ఆప్ చేయకపోవడం వలన ఇలాంటివి పునరావృతం అవుతున్నాయని తెలిపారు. గ్రామానికి కావాల్సిన నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక ఆదికారి దుబేర రాణి, పంచాయతీ కార్యదర్శి, నాయకులు తుమ్మల కనకయ్య, గోగు మల్లేశం, మహిళలు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఘనంగా ముగిసిన ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంప్

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్‌లో హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి చంద్ర ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంప్ ఘనంగా ముగిసింది. శుక్రవారం క్రికెట్ క్రీడాకారులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్దిపేట జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు రాష్ట్రపతి అవార్డు గ్రహీత దేశబోయిన నర్సింలు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీరక దారుఢ్యం స్నేహభావం పెంపోందిస్తుందని. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని క్రికెట్‌లో మెలకువలు నేర్పే విధంగా సమ్మర్ క్రికెట్ క్యాంప్ నిర్వహించడం అభిందనీయమని నిర్వాహకులను అభినందించారు. అనంతరం హరి చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సమ్మర్ క్రికెట్ క్యాంప్ నిర్వహణకు హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ ముందుకు రావడం సంతోషంగా ఉందని, క్రికెట్‌లో గజ్వేల్ నుంచి రాష్ట్ర దేశ స్థాయిలో పాల్గొనే విధంగా క్రికెట్ క్రీడాకారులను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా క్రికెట్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని, సమ్మర్ క్రికెట్ క్యాంప్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు బాకీ స్వామి, ఖాజా పాషా, శ్రీనివాస్, భాస్కర్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

- రూ.500 బోనస్ వెంటనే వర్తింపజేయాలి
- బీజేపీ మండల శాఖ అధ్యక్షులు టేకులపల్లి బాల్ రెడ్డి



నవతెలంగాణ-వర్గల్

వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని వర్గల్ మండల శాఖ బీజేపీ అధ్యక్షులు టేకులపల్లి బాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ శ్రేణులు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇవ్వగా, ప్రస్తుతం సన్న రకం ధాన్యానికి మాత్రమే వర్తింపజేస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సన్న, దొడ్డు రకాలకు బోనస్ చెల్లించాలని పేర్కొన్నారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయాలని, సాగుకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతు పెట్టుబడి సాయం, సబ్సిడీపై సూక్ష్మ సేద్యం పరికరాలను ప్రభుత్వం సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పంజాల వెంకట్ గౌడ్, నేతలు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ గౌడ్, ప్రదీప్ గౌడ్, నరేందర్ రెడ్డి, నాగరాజు గౌడ్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కలిపించడంలో ప్రభుత్వం విఫలం
- ఊరిలకు ఫోటో అప్లోడ్ నిబంధనను తొలగించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్

నవతెలంగాణ-మిరుదొడ్డి

ఉపాధి హామీ కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి రాళ్ళబండి శశిధర్ అన్నారు. శుక్ర వారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీని రోజు రోజుకు నిర్వీర్యం చేసే విధానాలను చేపడుతుందని, ఈ విధానాల వల్ల కూలీలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. 2005లో ఉపాధి హామీ చట్టాన్ని వామపక్షాల పోరాటంతో చేసిందన్నారు. చట్టంలో రూపొందించిన నిబంధనలను ఏ మాత్రం పాటించడం లేదన్నారు. 2005లో కేంద్ర బడ్జెట్లో రూ.98 వేల కోట్లుతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు కేటాయిస్తే 2024-25 సంవత్సరానికి కేవలం 56 వేల కోట్లు మాత్రమే ఉపాధి ఆమెకి కేటాయించారని దీనివల్ల కూలీలకు పెండింగ్ బిల్లులతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కొత్తగా జాబు కార్డులు ఇవ్వడం లేదని పని ప్రదేశాల్లో చిన్న పిల్లల్ని ఆడించడానికి నీడ కల్పించేందుకు టెంట్లు వేయాలని, మంచినీరు, రవాణా సౌకర్యం కల్పించడం లేదని అన్నారు. కూలీలకు గడ్డపార తట్ట పారా కొడవళ్ళు గొడ్డలి లాంటి పనిముట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. కొలతల పేరుతో గట్టి ప్రదేశాలలో కనీస కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని ప్రభుత్వం పేరుకే రూ.300 కూలి అని చెప్పినా ఎక్కడ అమలు కావడం లేదని విమర్శించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రోజురోజుకు నిర్వీర్యం చేసే విధంగా అనేక ఆకాంక్షలు విధిస్తూ ఉదయం సాయంత్రం ఫోటోలు అప్లోడ్ చేయాలని, డ్రోన్ కెమెరాలతో పనులను పర్యవేక్షించాలని రకరకాల నిబంధనలు పెట్టి ఉపాధికి కూలీలను దూరం చేసే విధానం



తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలని ఉపాధి పని 200 రోజులకు పెంచాలని రోజు కూలీ రూ.600 ఇవ్వాలని పని ప్రదేశాలలో సౌకర్యాలు కల్పించాలని పనిముట్లు ఇవ్వాలని ఏదైనా ప్రమాదం సంభవిస్తే చట్టప్రకారం వారికి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న పథకాలలో ఉపాధి కూలీలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల కూలీ బందు ఇస్తానని ప్రకటించిందని, దానిని కూడా వెంటనే అమలు చేయాలని ఇండ్లు లేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇంటి జాగాతో పాటు ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని, అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి, బోయిని వెంకటి, ఈదరి కనకవ్వ, ఈదరి కొండవ్వా, నాగరాజు, మైపాల్రెడ్డి, బిట్ల రేన, నర్సింలు, కిష్టయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రాకేష్ రెడ్డిని గెలిపించాలి



నవతెలంగాణ-మద్దూరు

వరంగల్, నల్లగొండ, ఖమ్మం, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగు రాకేష్ రెడ్డిని గెలిపించాలని. బిఆర్ఎస్ మండల మండల అధ్యక్షుడు మంద యాదగిరి కోరారు. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు దూల్మిట్ట మండలంలోని అన్ని గ్రామాలలో పట్టభద్రుల ఓటర్లను ఓటు అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్, నల్లగొండ, ఖమ్మం, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగు రాకేష్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి నాచగోని పద్మ వెంకట్ గౌడ్, మాజీ సర్పంచులు దుబ్బుడు దీపిక వేణుగోపాల్ రెడ్డి, ముక్క కనకయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి సాగర్, గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

ఎంపీపీ ఆధ్వర్యంలో ప్రచారం



నవతెలంగాణ-మద్దూరు

వరంగల్, ఖమ్మం, నల్లగొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగు రాకేష్ రెడ్డి విజయం ఖాయమని. మద్దూరు ఎంపీపీ బద్దపడగా కృష్ణారెడ్డి అన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని లద్నూర్, సలాక్ పూర్, గ్రామాలలో పట్టభద్రుల ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్లగొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగు రాకేష్ రెడ్డిని పట్టభద్రులు భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏనుగు రాకేష్ రెడ్డి మండలలో ఎమ్మెల్సీగా ఉంటే నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేబర్తి పిఏసిఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, మద్దూరు సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జీడి కంటి సుదర్శన్, కొమురవెల్లి దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి విజయం కోసం ప్రచారం



నవతెలంగాణ-చేర్యాల

వరంగల్, నల్గొండ, ఖమ్మం నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని శుక్రవారం ఆపార్టీ నాయకులు చేర్యాల పట్టణంలోని 5వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ముస్త్యాల బాల నర్సయ్య మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడు రాకేష్ రెడ్డి విజయానికి అందరూ కృషి చేయాలని, బ్లాక్ మెయిలర్ మల్లన్నను ఓడించాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ప్రచారంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, శివగారి అంజయ్య, పాక పర్శరాములు, పరందాములు తదితరులు పాల్గొన్నారు.

విత్తన డీలర్లు స్టాక్ ధరల పట్టిక బోర్డులను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మర్కుక్



విత్తన డీలర్లులందరూ స్టాక్, ధరల పట్టిక బోర్డులను రైతులకు కనపడేవిధంగా ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయ అధికారి డా.టి. నాగేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గణేశపల్లి గ్రామంలో గల విత్తన షాప్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పరిక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన డీలర్లులందరూ స్టాక్, ధరల పట్టిక బోర్డులను రైతులకు కనపడేవిధంగా ఏర్పాటు చేసుకోవాల సూచించారు. వ్యాపారులు విత్తనాల బిల్లులు, ఇన్వాయిస్‌లను తనిఖీ సమయంలో అధికారులకు చూపాలన్నారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు బిల్లులను తీసుకుని పంట కాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా అన్నమయ్య జయంతి మహోత్సవం

నవ తెలంగాణ-సిద్దిపేట



జిల్లాలో జరిగిన శ్రీ అన్నమాచార్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు అన్నమయ్య పవన్ నిర్వహణలో తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అన్నమాచార్య విగ్రహానికి అభిషేకం, అర్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నమయ్య పవన్, శిష్యబృందం అన్నమయ్య సంకీర్తన గానం చేశారు. తర్వాత ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి, స్వామి వారి తీర్థ, ప్రసాదాలు అందచేశారు.

విద్యుత్ వైర్లకు చుట్టూ ఉన్న చెట్లను తీసివేయాలి

- రాష్ట్ర యుత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని విద్యుత్ వైర్లకు చుట్టూ ఉన్న చెట్లను తీసివేయాలని, వాటి వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి గోపికృష్ణ అధికారులను కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు, గాలి రావటంతో చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడ కూడా విద్యుత్ సరఫరా ఆగిపోవద్దని ఆదేశాలు జారీచేశారని, కానీ సిద్దిపేటలో చాలా సందర్భాలలో చెట్ల వలన విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హరితహారం పేరిట ఇష్టానుసారంగా పనికిరాని చెట్లు పెట్టడం వల్ల ప్రజలు అనారోగ్యంతో



బాధపడుతున్నారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కమిషనర్‌ని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డి, సీతాబాలు, కరణకర్, సంబమూర్తి, రాజిరెడ్డి, ప్రతాప్, నర్సింగ్ యాదవ్, అంజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రశాంత్, జునేదు, జనార్ధన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చర్చించా

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



ప్రజా సమస్యలపై చర్చించినట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ నిర్మాణం జరుగుతున్న స్థలంలో ప్రయాణికులు, ప్రజలు జఠిలమైన సమస్యను పరిష్కరించేందుకు మార్కెట్ శాఖ అధికారులతో మాట్లాడి బస్టాండ్ పక్కకున్నా వేజ్, నాన్ వెజ్ మార్కెట్ ముందు బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. రోడ్డుపైనే బస్సులు నిలబడడంతో ప్రయాణికులు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. వేజ్, నాన్ వెజ్ మార్కెట్ ముఖ ద్వారం ద్వారా బస్సులను లోపలికి వెళ్లి తిరిగి వచ్చేలా ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను స్థలాలను తీసుకొని నిర్మాణం చేసి పూర్తి చేయలేదన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్టాండ్లు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. బస్టాండ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు సంబంధిత శాఖ మంత్రులతో మాట్లాడతానని ఆయన చెప్పారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలో పాత ఎంపీడీవో కార్యాలయంలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని మరో పోలీస్ స్టేషన్ మల్లన్న సాగర్ సమీపంలో ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులతో చర్చించినట్లు ఆయన చెప్పారు. ప్రథమంగా బస్టాండ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా చాపల మార్కెట్ రోడ్డులో గతంలో చిరు వ్యాపారులకు కట్టిస్తామన్న గదులను నిర్మిస్తామన్నారు. అదేవిధంగా ఇందిరాపార్క్ నుంచి మార్కెట్ పొడుగునా ప్రత్యేక గదులను నిర్మించేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ ఉన్న హెర్బల్ పార్కులోనికి ప్రజలను అనుమతించాలని సంబంధిత శాఖ అధికారులకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సూచించారు. మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య, మార్కెట్ కార్యదర్శి జాన్ వెస్లీ, పీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క రేగొండ గౌడ్, సమీర్, నక్క రాములు గౌడ్, సురేష్, వహీద్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో నాణ్యమైన విత్తనాలు

- తోర్నాల ఏఆర్ఎస్‌లో విత్తన మేళ
- పచ్చరొట్టెతో రైతులుకు మేలు
- ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్
- ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా.ఎస్.శ్రీదేవి



నవతెలంగాణ-సిద్దిపేట రూరల్

రైతులకు అందుబాటులో నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ ఎస్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా వారు రైతులు శాస్త్రవేత్తలు కలిసి వివిధ పంటలలో యాజమాన్య పద్ధతులపై చర్చ గోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పరిశోధన స్థానంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వరిలో దొడ్డు రకాలైన జెజిఎల్-24423(జగిత్యాల వరి-1), కెఎన్ఎం-118(కునారం సన్నలు) సన్న రకాలైన కెఎన్ఎం-1638(కునారం వరి-2), డబ్ల్యుజిఎల్-44(సిద్ధి), డబ్ల్యుజిఎల్-962(వరంగల్ వరి-2), ఉన్నాయన్నారు. కందిలో డబ్ల్యుఆర్ జిఈ -97(వరంగల్ కంది-1), డబ్ల్యుఆర్ జి ఈ -93(తెలంగాణ కంది-1), డబ్ల్యుఆర్ జి ఈ -255(వరంగల్ కంది-2), రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు పచ్చి రొట్ట ఎరువులు పండించాలని, విత్తనం దొరకని యెడల పెసర వేసుకోవచ్చు అని సూచించారు. అంతేకాకుండా రైతులు వ్యవసాయ పరిశోధన స్థానంలో దొరికే నాణ్యమైన ఫౌండేషన్ సీడ్ విత్తనాన్ని కొనుగోలు చేసి దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ జక్కుల విజయ్, శాస్త్రవేత్తలు ఉమారణి, సరిత, శ్వేత, శ్రీజయ, రమాదేవి, పల్లవి, రాజా వివిధ గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-సిద్దిపేట



జిల్లాలో జరిగిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలోని 6 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. 2307 మంది విద్యార్థులకుగాను 2143 మంది విద్యార్థులు హాజరయ్యారని, 164 విద్యార్థులు గైరాజర్ అయినట్లు తెలిపారు. 92.89 శాతం పరీక్షలు రాసినట్లు తెలిపారు. విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి పంపించేముందు క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించినట్లు తెలిపారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రంలో అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. బాలురులలో 1027 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 82 మంది గైర్హాజరయ్యారని, 92.60 శాతం పరీక్షలు రాసినట్లు తెలిపారు. బాలికలలో 1116 మంది విద్యార్థినీలు పరీక్షలు రాయగా, 82 గైరాజర్ అయ్యారని, 93.16 శాతం హాజరైనట్లు తెలిపారు. ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య

నవతెలంగాణ-గజ్వేల్



గత ప్రభుత్వం భూరికార్డుల ఆధునీకరణలో భాగంగా ధరణి తీసుకుని వచ్చిందని దీని ద్వారా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భూరికార్డులు వెంటనే సరి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని అమ్మది పూర్ గ్రామానికి సంబంధించిన భూ రికార్డులు సరి చేయాలని గ్రామ రైతులు తహశీల్దార్‌కు దరఖాస్తు పెట్టారన్నారు. ధరణి నూతన చట్టం వల్ల గత 40, 50 సంవత్సరాలుగా భూ పహానిలో రైతుల పేరు ఉండగా 2018 సంవత్సరంలో ధరణి వచ్చిన ఫలితంగా భూ యజమానుల పేరు కాకుండా గ్రామంలోని ఇతరుల పేర్లు ఆన్లైన్లో వస్తున్నాయని తెలిపారు. కబ్జాలో ఉన్న వ్యవసాయం చేస్తున్న భూ యజమానుల పేర్లు కాకుండా ఇతరుల పేర్లు నమోదు చేసి పేదలను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రికార్డులు సరి చేయాలని ఎమ్మార్వోను అడిగిన తమ పరిధిలో ఏమీ లేదంటూ కోర్టుకెళ్లాలని సూచించడం జరుగుతుందన్నారు. దీంతో రైతుల సమస్యలు మరింత జటిలమవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రికార్డులు మొత్తం సరిచేయాలని గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు రైతులను బలి పశువులను చేస్తున్నారన్నారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనట్లయితే జిల్లా స్థాయిలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)నాయకులు వెంకట చారి రైతులు వెంకటరాములు, బాలయ్య పాల్గొన్నారు.

'సర్ సి.వి.రామన్ సైన్స్ మ్యూజియం'ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి ఓల్డ్ డీఆర్‌డీఓ కార్యాలయం ప్రాగణంలో ఏర్పాటు చేసిన 'సర్ సి.వి.రామన్ సైన్స్ మ్యూజియం'ను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు శుక్రవారం సందర్శించారు. మ్యూజి యం ఆవరణలో సైన్స్ (పరిక రాలను) ప్రాజెక్టులను, మ్యూజియం బయట గల బొటానికల్ గార్డెన్ లోని మొక్కలను పరిశీలించారు. మ్యూజియం అభివృద్ధికి సంబంధించిన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి,సెక్టోరియల్ అధికారి/సీఎంఓ, వెంకటేశం, జిల్లా సైన్స్ అధికారి పి.సిద్దారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్బందులు కలవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-మిరుదొడ్డి



గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీదేవి సూచించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట భూంపల్లి మండలం మోతే గ్రామంలో సిఆర్‌డిటీం గ్రామపంచాయతీ పనుల ను పరిశీలించారు. అనంతరం గ్రామం లో నర్సరీని పరిశీలించి పలు సూచ నలు చేశారు. వేసవికాలం ఇబ్బందులు గ్రామంలో తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి మమత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశాలు వాయిదా

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో ఈనెల 25, 26 తేదీల్లో జరిగే సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశాలు అనివార్య కారణాలవల్ల వాయిదా వేసినట్టు సీఐటీయూ క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్ తెలిపారు. ఈ విషయాన్ని కార్మికులు, శ్రేయోభిలాషులు గమనించాలని సీఐటీయూ జహీరాబాద్ క్లస్టర్ కమిటీ సభ్యులు, కార్మికులు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు.



మున్సిపల్‌లో వాటర్ లీకేజీ లేకుండా చూడాలి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో వాటర్ లీకేజీ లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని చోట మరమతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను వెంటనే తొలగించాలని మురికి కాలువలు శుభ్రం చేయాలని ఆయన కోరారు. వాటర్ లీకేజ్ ఉంటే సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకూడదని వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 19 వ వార్డు కౌన్సిల్ సభ్యులు గుంటుకు శిరీష రాజు, మున్సిపల్ ఎస్సై శివకుమార్, మున్సిపల్ ఏఈ ఈ కిష్టన్న తదితరులు ఉన్నారు.



మేళాసంఘంలో రెండు బోర్ మోటార్ల ఏర్పాటు

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మేళసంఘం గ్రామంలో నీటి ఎద్దడి తీర్చేందు కుగాను శుక్రవారం రెండు బోర్ మోటార్లు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ మాజీ అధ్యక్షులు రాంరెడ్డి బోర్ మోటార్లను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వాణి, యువజన కాంగ్రెస్ నాయకులు ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీలుగు విత్తనాలు అందక రైతుల ఇబ్బందులు

నవతెలంగాణ-మిరుదొడ్డి

సాగుకు సన్నదం అవుతున్న రైతులకు నేటికీ జీలుగా విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి అన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో జీలుగా విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం సరఫరా చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు అందుబాటులో జీలగ విత్తనాలు ఉంచడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు కావలసిన జీలుగా విత్తనాలతో పాటు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్ల వినతి పత్రాన్ని డిఏఓ శివప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి తాజా మాజీ సర్పంచ్ రాములు, నాయకులు లింగం, సత్యనారాయణ, భైరయ్య, కిష్టయ్య, బాలరాజు, పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు చేసిందని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నావన్నారు. ఉచిత విద్యుత్, రైతు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తమ రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో గజ్వేల్ మరింత అభివృద్ధి చేసుకుంటామన్నారు.



గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం

నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ఆరోగ్య సలహాలు అందించేందుకు ప్రథమ చికిత్సలయం ఎంతగానో దోహదపడుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండల కేంద్రంలో డాక్టర్ అంజలి నూతనంగా ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్సలయాన్ని వారు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన చికిత్సను అందించాలని సూచించారు. మహిళల ఆరోగ్య సమస్యలను తెలియజేసేందుకు అందుబాటులో ప్రథమ చికిత్సలయం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని డాక్టర్ అంజలికి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లింగం, బైరయ్య, నగేష్ రెడ్డి, రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పలువురు పాల్గొన్నారు.

ధాన్యం తీసుకున్న వెంటనే టోకెన్‌లు అందజేయాలి



నవతెలంగాణ-పుల్కల్

రైతుల వద్ద నుంచి ధాన్యం తీసుకున్న వెంటనే వారికి టోకెన్‌లు అందజేయాలని ధాన్యం కొనుగోలు సెంటర్ నిర్వాహకులకు కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. మండలంలోని ఇసోజిపేట్, కోడూరు, పుల్కల్ గ్రామంలో కొనసాగుతున్న ఐకేపీ, పీఏసీఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను, పీఏసీఎస్ గోదాములను శుక్రవారం పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ధాన్యానికి తరుగు ఏమైనా తీస్తున్నారా అని రైతులను ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని సమాధానం ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియచేయాలన్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని అధికారులకు సూచించారు. సేకరించిన ధాన్యాన్ని వెంట వెంట లారీల్లో లోడ్ చేయించి, రైతుల నుంచి ధాన్యం తీసుకున్న వెంటనే టోకెన్‌లు అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాల కూరుస్తున్నందున రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట అందోల్ ఆర్‌డీఓ పాండు, పుల్కల్ తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన భారతి హెూలీకేరి



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారం మినీ స్టేడియం ఆవరణలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారి భారతి హెూలీకేరి, జిల్లా అదనపు కలెక్టర్ మాధురి బృందం శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా భారతి హోళీకేరి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వెంట వెంటనే ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలని, లారీలు అందుబాటులో ఉంచి రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. తొందరగా ధాన్యాన్ని తరలించిన ట్లయితే రైతాంగానికి కూడా ధాన్యపు కొనుగోలుకు సంబంధించిన డబ్బులు బ్యాంకు అకౌంట్లో పడతాయని అధికారులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు, తహసీల్దార్ బిక్షపతి, జిన్నారం మండల వ్యవసాయ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, ఐకెపి ఏపీఎం నరేందర్ డీఎం సివిల్ సప్లయి అధికారి, జిన్నారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ, వరి ధాన్యపు కొనుగోలు కేంద్రం నిర్వాపకులు మేదరి లత, రామచందర్, రైతులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో మెరుగైన వైద్యం

సురభిలో ఎమ్మారై స్కానింగ్ సెంటర్ ప్రారంభించిన చైర్మెన్ హరేందర్ రావు..



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి వైద్య విజ్ఞానిక కళాశాల, సురభి మల్టీస్పెషల్టి హాస్పిటల్‌నందు పేదలకు అతి తక్కువ ధరకే నాణ్యమైన మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని చైర్మన్ హరేందర్ రావు అన్నారు. శుక్రవారం కళాశాలలో ఏంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్ మదర్ కంగారు చిల్డ్రన్ కేర్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో నిరుపేదలు స్కానింగ్ అంటేనే భయపడుతున్నారని అటువంటి వారికి అతి తక్కువ ధరతో అన్ని రకాల స్కానింగ్ సురభిలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్కానింగ్‌తో పాటు అనుభవమైన డాక్టర్లచే మెరుగైన వైద్యం కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఖర్చుతో కూడుకున్న వైద్యాన్ని చేయించుకోలేక చాలామంది పేదలు ఇబ్బందుల పాలవుతున్నారని అటువంటి వారికి సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ తక్కువ ధరలతో చికిత్స అందిస్తూ అండగా నిలుస్తుందని తెలిపారు. సేవలను చుట్టుపక్క గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రామచంద్ర రావు, సూపరింటెండెంట్ డాక్టర్ శివరామ చారి, పిఆర్వో పరశురాములు డాక్టర్ల బృందం తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిర్వీర్యమంటే.. నోటికాడి కూడు లాక్కోవడమే



నవతెలంగాణ-కొండాపూర్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నదని.. ఉపాధి హామీ నిర్వీర్యం అంటే పేదల నోటికాడి కూడు లాక్కోవడమేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నర్సిములు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యకాస కొండాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మునిదేవునిపల్లి గ్రామ ఉపాధి హామీ పని ప్రదేశాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనిచేసిన 15 రోజుల్లో కూలీ డబ్బులు ఇవ్వాలని చట్టం చెబుతున్నా.. కొన్ని నెలలుగా డబ్బులు ఎందుకు డబ్బులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచినీళ్లుకచ్చితంగా ఉంచాలన్నారు. పని ప్రదేశంలో దెబ్బలు తగిలితే మట్టిని పూసుకోవాల్సి వస్తుందని వాపోయారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.800కు పెంచాలని, ఏడాదిలో 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో జియో ట్యాగింగ్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె రాజయ్య, గోపాల్, నర్సింలు, వెంకటయ్య, సాయన్న, బాలయ్య, పరుశురాం గౌడ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్ మృతి

- న్యాయం చేయాలంటూ మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన
- రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తామని అధికారుల హామీ
- ఆందోళన విరమించిన కుటుంబ సభ్యులు



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మల్లికార్జున్‌పల్లి గ్రామ శివారులో గల 11కెవి విద్యుత్ వైర్ల మరమ్మతులు చేస్తుండగా జూనియర్ విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి చెందాడు. పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివ రాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణానికి చెందిన బాల్‌రాజ్(22) మల్లికార్జున్‌పల్లి గ్రామంలో విద్యుత్ శాఖలో జేఎల్‌ఎంగా పని చేస్తున్నాడు. విద్యుత్ వైర్ల మరమ్మతుల నిమిత్తం మల్లికార్జున్‌పల్లి గ్రామ శివారులో శుక్రవారం పని చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా తోటి లైన్‌మెన్ హరి మునిపల్లిలో విద్యుత్‌కు సంబంధించి పనులు ముగి ంచుకొని బాల్‌రాజ్‌కు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. దీంతో మల్లికార్జున్‌పల్లి గ్రామ శివారులోని మరమ్మతులు చేస్తున్న స్థలానికి హరి చేరుకోగా.. బాల్‌రాజ్ విద్యుత్ వైర్లపై వేలా డుతూ కనిపించాడు. వెంటనే సంబంధిత శాఖ ఏఈ ప్రశాంత్‌కు



ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో సం ఘటన స్థలానికి ఏఈ ప్రశాంత్ తన సిబ్బందితో చేరుకొని పోలీసులు, విద్యుత్ శాఖ ఏడీ వీరారెడ్డి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న బాధిత కుటుంబ సభ్యులు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సదాశివపేట, కొండాపూర్ సీఐలు మహేష్, చంద్రయ్య, కొండాపూర్, మునిపల్లి ఎస్‌ఐలు హరిశంకర్, సురేష్, విద్యుత్ శాఖ ఏడీ వీరారె డ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని నచ్చజెప్పారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా ఇప్పిస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

భూ వివాదంలో పోలీసులు వేధిస్తున్నారని ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-జహీరాబాద్

భూ వివాదంలో పోలీసులు వేధిస్తున్నారన్న ఆరోపణతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటన మొగుడం పల్లి మండలంలోని సర్జారావుపేటతాండాలో జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సర్జారావుపేటతాండాకు చెందిన చందర్ రాథోడ్.. తన 15 గుంటల భూమిని తన సోదరుడైన కీరు రాథోడ్ అక్రమంగా సాగు చేసుకున్నాడని గురువారం జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే రెవెన్యూకు సంబంధించిన విషయమని.. మీరు రెవెన్యూలో తేల్చుకోవాలి లేదా కోర్టుకెళ్లాలని సర్ది చెప్పి పంపించారు. చివరికి గ్రామంలోనే గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ చేసుకోవాలని చెప్పారు. దాంతో చందర్ రాథోడ్ డీఎస్పీ ఎదుట తన గోడును వినిపించుకున్నాడు. డీఎస్పీ స్పందించి సివిల్ విషయాల్లో పోలీసులు జోక్యం చేసుకోరని.. కోర్టుకు వెళ్లాలని సర్ది చెప్పారు. దాంతో చందర్ రాథోడ్ పెద్దన్న జ్ఞానేందర్ పోలీసుల సమక్షంలోనే ఈ పంచాయతీ తేల్చుదామని కీరు రాథోడ్‌ను స్థానిక కమ్యూనిటీ వైద్యశాల వద్దకు పిలిపించారు. ఈ నేపథ్యంలోవచ్చిన వెంటనే కీరు రాథోడ్ తనవెంట తెచ్చుకున్న విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన కుటుంబ సభ్యులు స్పం దించి వెంటనే జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేసి సంగారెడ్డి వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ విషయమై జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతూ.. సర్వేనెంబర్ 140లో హీరో రాథోడ్ కుటుంబ సభ్యులైన జ్ఞానేందర్, చందర్, కీరు రాథోడ్‌లకు ఒక్కొక్కరికి ఐదు ఎకరాలు 11 ఎకరాలు భూమి ఉంది. ఆ భూమిలో సర్వే నిర్వహించగా చందర్ రాథోడ్‌కు సంబంధించిన 15 గుంటల భూమిలో కీరు రాథోడ్ అక్రమంగా సాగుచేసుకుంటున్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రూరల్ పోలీసులు విచారణ జరిపి రెవెన్యూ డిపా ర్ట్మెంట్లో తేల్చుకోవాలని సలహా ఇచ్చి పంపించారు. సర్జరా వ్‌పేటతండాకు చెందిన కుల పెద్దలు కీరు రాథోడ్ పెద్దన్న జ్ఞానేందర్ పిలిచిన వెంటనే కీరు రాథోడ్ ఆత్మహత్యకు పాల్ప డినట్లు తెలిసింది. ఈ ఆత్మహత్యాయత్నంలో పోలీసులకు ఎలాంటి ప్రమేయం లేదు. గ్రామంలో లా అండ్ ఆర్డర్ సమస్య రాకూడదన్న ఉద్దేశంతోనే వారి కుటుంబ సభ్యులను పిలిపించి గ్రామంలో పెద్దల సమక్షంలో పంచాయతీ చేసుకోవాలని సూచించాము.

టైలరింగ్ పనులలో నాణ్యత ఉండాలి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్కూల్ యూనిఫామ్ టైలరింగ్ పనులలో నాణ్యత ఉండాలని సిద్దిపేట డిఆర్‌డిఓ జయదేవ్ ఆర్య అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలోని శ్రీ శక్తి స్వశక్తి టైలరింగ్ యూనిట్ ను సిద్దిపేట డిఆర్డిఓ జయదేవ్ ఆర్య సందర్శించారు. స్కూల్ పిల్లల యూనిఫామ్‌లు ఏ విధంగా కుడుతున్నారని అడిగి తెలుసు కు న్నారు. పాఠశాలలో ప్రారంభ కాకముందే విద్యార్థులకు యూనిఫామ్స్ అందేలా పనులు చకచక చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో సిఆర్‌డి స్వామి గౌడ్, ఎంపీడీవోలు వేణు గోపాల్



రెడ్డి, జయరామ్, సేర్ప్ ఏపిఎం జి శ్రీనివాస్ గౌడ్,, ఏపీవోలు రమాదేవి, ప్రభాకర్, సీసీలు అశోక్, రవీందర్, శ్రీలత, ఈజిఎస్ సిబ్బంది పరశురాములు, శ్రీధర్ పాల్గొన్నారు.

నల్లమల గిరి ప్రసాద్ 27వ వర్ధంతి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఖమ్మం జిల్లా కన్నబిడ్డ నల్లమల గిరిప్రసాద్ 27వ వర్ధంతిని శుక్రవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. గిరి ప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాటాడుతూ నలమల గిరి ప్రసాద్ ప్రజల పక్షాన పోరాడిన యోధుడని కొనియాడారు. నిర్బంధాలు నియంతృత్వమే కాదు తుపాకు తూటాలు సైతం ఆయనను ఆపలేక పోయాయని, 16 సంవత్సరాల ప్రాయంలో ఆంధ్ర మహాసభ సభ్యత్వ సేకరణతో మొదలై 50 సంవత్సరాల పాటు సాగిన రాజకీయ ప్రస్థానంలో ఏనాడు విశ్రమించని అవిశ్రాంత పోరాట యోధుడు నలమల గిరి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు , వణేష్, మల్లేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలిపై లైంగిక వేధింపులు దారుణం

- శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌ను అరెస్టు చేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లోని గాజుల రామారం 25వ సర్కిల్ పరిధిలో మున్సిపల్ కార్మికురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడిన శానిటేషన్ ఫీల్డు అసిస్టెంట్ కిషన్‌ను అరెస్టు చేయాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ. రమ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కార్మికురాలిని లైంగికంగా వేధించడం దారుణమని పేర్కొన్నారు. అతన్ని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

డీహైడ్రేషన్ కోసం డబ్ల్యూహెచ్ఓ సిఫార్సు చేసిన ఓఆర్ఎస్

నవతెలంగాణ - హైదరాబాద్



భారతదేశంలో మండుతున్న ఎండలతో పాటుగానే డీహైడ్రేషన్ సమస్యను ఎదుర్కోవడంలో ఒక క్లిష్టమైన సవాలును సైతం ఎదుర్కొంటోంది. ముఖ్యంగా పిల్లలలో మరణాలకు మూడవ ప్రధాన కారణమైన అతిసార కేసుల పరంగా సవాళ్ళను ఎదుర్కొంటుంది. ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్ (ఓఆర్ఎస్) ఒక ముఖ్యమైన ఔషధం అయినప్పటికీ, ఇటీవలి ఎన్ఎఫ్‌హెచ్ఎస్ -5 డేటా అతిసారంతో బాధపడుతున్న పిల్లలలో 60.6% మాత్రమే ఓఆర్ఎస్ ని అందుకుంటున్నారని వెల్లడిస్తుంది, ఇది అవగాహన, సరైన వినియోగం పెరగాల్సిన ఆవశ్యకతను హైలైట్ చేస్తుంది. ఫిలిం నగర్‌లోని మాగ్నా సెంటర్స్‌లోని చీఫ్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ మాట్లాడుతూ పిల్లలలో డైయేరియా, డీహైడ్రేషన్ సమస్యను నిర్వహించడంలో ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) యొక్క ముఖ్యమైన పాత్రను వెల్లడిస్తూ, "డయేరియా కారణంగా వేగంగా శరీరం లో నీటి శాతంతో పాటుగా ఎలక్ట్రోలైట్ నష్టానికి దారితీస్తుంది. ఫలితంగా తీవ్రమైన డీహైడ్రేషన్ కు దారితీస్తుంది. సూటిగానే అయినప్పటికీ శరీరంలో నీటి శాతం, ఎలక్ట్రోలైట్‌లను ఓఆర్ఎస్ పునరుద్ధరిస్తుంది. ఐదేళ్లలోపు పిల్లలను త్వరగా కోలుకునేలా చేసే అత్యంత ప్రభావవంతమైన నివారణ ఇది. ప్రభావవంతంగా మాత్రమే కాకుండా సురక్షితంగా కూడా ఓఆర్ఎస్ ఉంటుందని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సరైన పరిమాణంలో లేని ఉప్పు లేదా చక్కెర మిశ్రమాలు హానికరం. సరైన డీహైడ్రేషన్ చికిత్సకు నీరు మరియు ఎలక్ట్రోలైట్‌ల యొక్క ఖచ్చితమైన సమతుల్యత అవసరం. సరికానటువంటి రీతిలో ఇంట్లో తయారుచేసిన సొల్యూషన్స్ లేదా అధిక చక్కెర పానీయాలను ఉపయోగించడం వల్ల ఈ సమతుల్యత దెబ్బతింటుంది. ప్రజా అవగాహన ప్రచారం ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క ప్రమాణాలతో కూడిన ఓఆర్ఎస్ సొల్యూషన్స్ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది. గుర్తించదగిన బ్రాండ్‌లు అయినటువంటి ప్రోలైట్ ఓఆర్ఎస్, డాక్టర్ మోరేపెన్ ఓఆర్ఎస్, లేదా ఓఆర్ఎస్ వాలైట్ వంటివి ఈ ప్రమాణాలకు కట్టుబడి ఉన్నాయి. డిహైడ్రేషన్ ను ఎదుర్కోవడానికి సురక్షితమైన మరియు సమర్థవంతమైన మార్గాన్ని అందిస్తాయి.

ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతుల్లేవ్..
- వ్యాపారంగా మారిన విద్య
- తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల్లో బెస్ట్ ఫీజుల నియంత్రణ చట్టం :ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు
- 'రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం-ఆవశ్యకత'పై రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో/కాప్రా

రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరిలోని ఈసీఐఎల్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం 'రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం - ఆవశ్యకత' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, చట్టం అమలు కోసం రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పోరాటం రూపొందిస్తామని తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ.. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినా.. ఇప్పటి వరకు ఎలాంటి చొరవా చూపలేదన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 374 విద్యాసంస్థల్లో సర్వే చేసినట్టు తెలిపారు. ప్రజలు విద్యార్థుల ఫీజుల కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తేలిందన్నారు. ప్రభుత్వ విద్యారంగంపై తల్లిదండ్రులకు నమ్మకం లేకుండా పోయిందని, దీనికి కారణం అక్షరాలా రాష్ట్ర ప్రభుత్వమే అని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో సరైన సౌకర్యాలు, సరిపడా టీచర్స్ లేరన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ వర్క్‌షాప్స్ పేరుతో తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో విద్య వ్యాపారమైందన్నారు. ఈ మూడు జిల్లాల్లోనే దాదాపు రూ.82వేల కోట్ల బిజినెస్ నడుస్తోందన్నారు. నర్సరీకే రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

15 రాష్ట్రాల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలులో ఉందని, వీటిని మోడల్‌గా తీసుకుని తెలంగాణలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోనే బెస్ట్ ఫీజుల నియంత్రణ చట్టం తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల్లో అమల్లో ఉందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయివేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు ఇవ్వాలని ఉన్నా అమలు కావడం లేదన్నారు.

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ.. ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ రూ.వేల కోట్లు దోచుకుంటున్నాయన్నారు. ప్రభుత్వ స్కూల్స్‌ని అభివృద్ధి చేయడం లేదన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి వరప్రసాద్ మాట్లాడుతూ.. విద్యకు జీడీపీలో 6 శాతం నిధుల కేటాయింపు జరగాలని ప్రతిపాదిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం 2.81 శాతం మాత్రమే కేటాయించినట్టు తెలిపారు.

అక్షరాస్యత పెరిగితే ప్రశ్నిస్తారనీ, ఎదురు తిరుగుతారనే కారణాలతోనే ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం లేదని ఆరోపించారు. నేపాల్‌లో 77 శాతం, శ్రీలంకలో 92 శాతం, బాంగ్లాదేశ్‌లో 74 శాతం, పాకిస్థాన్‌లో 58 శాతం అక్షరాస్యత ఉందని తెలిపారు. జపాన్, రష్యాను ఏషియన్ టైగర్స్ అంటారని, ఎందుకంటే అక్కడ 99 శాతం అక్షరాశ్యత ఉందని అన్నారు. ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలలు చాలా బాగున్నాయని, తెలంగాణలోనూ అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద, నాయకులు శారద, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అన్వర్, ఏఐఎస్ఎఫ్ కాప్రా మండల కన్వీనర్ సతీష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, ఏఐవైఎఫ్ నాయకులు ప్రసాద్, మహేష్, స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు శ్రీమన్నారాయణ, ఏఎస్‌రావు నగర్ విజ్ఞాన వేదిక నాయకులు యాదగిరిరావు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, జిల్లా సహాయ కార్యదర్శులు అవినాష్, కార్తీక్, జిల్లా కమిటీ సభ్యులు మహేశ్వర్, శివ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో అందలం..

ఆరు నెలల్లోనే వక్రబుద్ధి బహిర్గతం

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- అభ్యర్థుల గుణగణాలను పరిశీలించండి : ఎంపీ నామ
- మంచి వ్యక్తులను ఎన్నుకునే సంప్రదాయం : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి
- పట్టభద్రులారా మీ ఓటు వృధా కానీయొద్దు : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-సత్తుపల్లి

ఆరు గ్యారంటీ పథకాలతో అందలమెక్కిన కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం ఆరు నెలల్లోనే బహిర్గతమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్, పాలేరు నియోజకవర్గంలోని బారుగూడెం గ్రామం, సత్తుపల్లి మండలంలోని ఎంఆర్ గార్డెన్‌లో పట్టభద్రులతో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సభలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అందరిని మోసం చేసిందన్నారు. గులాబీ జెండా పుట్టిన కాడ్నుంచి ఈ సీటు బీఆర్ఎస్‌దేనన్నారు. ప్రస్తుతం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ఆషామాషీ కావని, ఈ ఎన్నికలు మన పిల్లల భవిష్యతు బాగుండాలని కోరుకొనే ఎన్నికలని తెలిపారు. ఇంతకు ముందు ఎన్నికైన పల్లా రాజేశ్వరరెడ్డి పట్టభద్రుల కోసం నిరంతరం పనిచేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్‌ను కూడా వేయలేక పోయారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగ భృతి ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడేమో ఆ హామీ ఇవ్వలేదని బుకాయిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలవకపోయినా వారికి ఏ ఢోకా ఉండదని, ఒకవేళ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే పట్టభద్రుల పక్షాన మాట్లాడే అవకాశం ఉండదన్నారు. అదే రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే.. అందరి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే దమ్ము అతనికి ఉందన్నారు.ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎవరి గుణం ఎలాంటిదో అందరికి తెలిసిందేనన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల గుణగణాలను పరిశీలించి ఎవరికి ఓటెయ్యాలో విజ్ఞులైన పట్టభద్రులు నిర్ణయించుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ .. మీడియాను అడ్డం పెట్టుకొని బ్లాక్ మెయిల్ చేసే వ్యక్తికి ఓటెయ్యాలా, నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్న వ్యక్తికి ఓటెయ్యాలా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలతో సంబంధం లేకుండా మంచి వ్యక్తులను ఎన్నుకొనే సంప్రదాయం మనకున్నదని, ఇప్పుడు కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని పట్టభద్రులను కోరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా పేద బిడ్డల భవిష్యతు గొప్పగా మారే అవకాశం ఉంటుందన్నారు. మీ ఓటు వృధా కాకుండా మొదటి ప్రాధాన్యత ఓటును 3వ నెంబరులో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి వేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐదు మండలాల నుంచి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు ప్రిన్సిపాళ్లను సంప్రదించండి

- అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో మొత్తం సీట్లతోపాటు ఏడు నుంచి పదో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేశామని మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల ఏడో తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించామనీ, 62,983 మంది దరఖాస్తు చేస్తే 51,877 (82.37 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. విద్యార్థుల మార్కులు, ర్యాంకులు, మెరిట్ జాబితాను పాఠశాల వారీగా రూపొందించి సంబంధిత మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు పంపించామని వివరించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు ప్రవేశాలకు సంబంధిత మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు ఫారం, హాల్‌టికెట్‌తోపాటు అవసరమైన ధ్రువపత్రాలను తీసుకెళ్లాలని కోరారు. ఇతర వివరాలకు telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌నుసంప్రదించాలని సూచించారు.

ఎడ్‌టెక్ లీడ్‌లో సిబిఎస్ఇ టెన్త్ పరీక్షలో 90% స్కోర్ చేసిన విద్యార్థులు 80 శాతం



నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ స్కూల్ ఎడ్‌టెక్ లీడ్ కు చెందిన 10వ తరగతి విద్యార్థుల 2024 సంవత్సరపు బ్యాచ్ , సిబిఎస్ఇ బోర్డు పరీక్ష ఫలితాల్లో అపూర్వ ఫలితాలను సాధించింది. గతేడాది 90 మంది విద్యార్థులు 90% కంటే ఎక్కువ మార్కులు సాధించగా, ఈ ఏడాది 161 మంది లీడ్ విద్యార్థులు 90% కంటే ఎక్కువ మార్కులు సాధించారు. లీడ్ పాఠశాలలకు వివరణాత్మక పాఠ్య ప్రణాళికలు, ఉపాధ్యాయులకు అవసరమైన వనరులు, అభ్యాస పరీక్షలు మరియు విద్యార్థులకు మాక్ పరీక్షలను నిర్వహించటం ద్వారా బోర్డు పరీక్షలకు సిద్ధం చేస్తుంది. అదనంగా, లీడ్ యాప్ విద్యార్థులకు అపరిమిత అభ్యాస అవకాశాలను అందిస్తుంది, వారి పరీక్ష కు సిద్ధం కావటంలో మరింతగా మద్దతు ఇస్తుంది. సంగారెడ్డిలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌కు చెందిన గైని అక్షయ, రాచపూడి శ్రీ చార్వి మోహన నివేదిత, లాడే సర్వేష్ కుమార్, మందా సాత్విక్, రెడ్డిగారి శ్రీజ వరుసగా 98%, 97%, 96%, 95% మరియు 95% సాధించడం గమనార్హం. అనేక మంది లీడ్ విద్యార్థులు గణితం, సాంఘిక శాస్త్రం మరియు సంగీతం వంటి సబ్జెక్టులలో 100 మార్కులు సాధించారు.

జెన్ ఏఐపై బైన్ అండ్ కంపెనీ మెటా రిపోర్ట్

నవతెలంగాణ - హైదరాబాద్

పెద్ద, చిన్న వ్యాపారాలలో సంభాషణాత్మక సందేశ ప్లాట్‌ఫారమ్ల స్వీకరణ వేగవంతం కావడంతో, ఉత్పాదక ఏఐ పరివర్తన శక్తి వ్యాపారాలను సంభాషణ ఆధారిత వాణిజ్యం వైపు మళ్లిస్తోంది. తాజాగా విడుదల చేసిన బైన్ అండ్ కంపెనీ, మెటా 'విన్ విత్ కన్వర్సేషన్స్' నివేదిక ప్రకారం, సమీక్ష నిర్వహించిన పెద్ద సంస్థలలో 70% ఇప్పటికే సంభాషణ ప్లాట్‌ఫారమ్లను ఉపయోగించి తమ వినియోగదారులలో సగం మందితో అనుసంధానమై ఉన్నాయి. అంతేకాకుండా, సమీక్ష నిర్వహించిన పెద్ద సంస్థలలో 60% మంది రానున్న 3-4 ఏళ్లలో సంభాషణ ప్రయాణాలపై తమ వ్యయాన్ని పెంచాలని యోచిస్తున్నాయి. ఈ నివేదిక, తుది వినియోగదారులు, వ్యాపారాల సమీక్ష ఆధారంగా, ఎంటర్‌ప్రైజెస్, చిన్న వ్యాపారాలు, డిజిటల్ వినియోగదారుల మధ్య సంభాషణ ప్రయాణాలకు సంబంధించిన అభిప్రాయాలను విశదీకరిస్తుంది. జెన్ ఏఐ ఈ దార్శనికతకు కేంద్రంగా ఉంటుందని మెటా హెడ్ ఉపాధ్యక్షురాలు సంధ్యా దేవనాథన్ తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ మహబూబ్ అలీ ఆకస్మిక మృతి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆఫీసు బేరర్, ఆడిట్ కమిటీ కన్వీనర్, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకుడు షేక్ మహబూబ్ అలీ (60) ఆకస్మికంగా శుక్రవారం మరణించారు. తీవ్రమైన గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లో ఆయన తుదిశ్వాస విడిచారు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వచ్చేనెల ఎనిమిదో తేదీన నిర్వహించబోయే తన కుమార్తె వివాహ నిమిత్తం పెళ్లి బట్టలు, ఆభరణాల కొనుగోలు కోసం ఆయన హైదరాబాద్‌కు వచ్చారు. కూకట్‌పల్లిలోని ఒక నగల దుకాణంలో షాపింగ్ చేస్తూ తీవ్రమైన గుండెపోటు తో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు పక్కనే ఉన్న ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధృవీకరించారు. సమాచారం తెలిసిన వెంటనే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, నాయకులు డి మస్తాన్ రావు ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన భౌతికకాయాన్ని ఖమ్మం పంపించేందుకు సహకరించారు. శనివారం మధ్యాహ్నం ఖమ్మంలో మహబూబ్ అలీ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరు

మహబూబ్ అలీ 1989లో చింతూరు మండలంలో ఉపాధ్యాయునిగా నియమితులయ్యారు. అప్పటినుంచి యూటీఎఫ్‌లో చురుకుగా పనిచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ మండలాల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. సంఘం విస్తరణకు విశేష కృషి చేశారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యునిగా, గత రెండేండ్లుగా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా, రాష్ట్ర ఆఫీసు బేరర్‌గా పనిచేస్తున్నారు. ఆర్థిక క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచారు. జిల్లా, మండల కమిటీల జమా ఖర్చుల నిర్వహణ, ఆడిటింగ్‌పై కార్యకర్తలకు తర్ఫీదునిచ్చారు. సంఘ కార్యక్రమాల్లోనూ, ఆర్థిక వ్యవహారాల్లోనూ ముక్కుసూటిగా వ్యవహరించేవారు. ఉపాధ్యాయుల సర్వీసు విషయాలపై మంచి అవగాహన కలిగి తరగతులను బోధించేవారు. జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేశారు. మంచి ఉపాధ్యాయునిగా పనిచేసిన ఆయన అన్ని పాఠశాలల్లోనూ గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన ఖమ్మం గ్రామీణ మండలం ఎంవి పాలెం ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

అలీ మరణం ఉపాధ్యాయులకు తీరనిలోటు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ మహబూబ్ అలీ మరణం ఉపాధ్యాయులకు తీరనిలోటని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తెలిపారు. ఆయన మరణం పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయాం : టీఎస్‌యూటీఎఫ్

నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోవటం సంఘానికి, ఉపాధ్యాయులకు తీరని లోటని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఆయన మరణం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి సంతాపం, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

'ఇండియా'తోనే సర్వతోముఖాభివృద్ధి

- దేశ ప్రజలు మార్పును కోరుకుంటున్నారు
- మోడీది నియంతృత్వ పోకడ
- ఫరీద్ కోట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే సుస్థిర ఆర్థిక విధానాలతో దేశ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అంతకు ముందు పలు సభలు, సమావేశాల్లో ప్రసంగించారు. డిప్యూటీ సీఎం వరుసగా మూడో రోజు ఫరీద్‌కోట్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా ప్రచారాన్ని కొనసాగించారు. మరోవైపు పార్టీ నేతలను సమన్వయం చేస్తూ సభలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఓటర్లతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. గత పదేండ్లుగా మోడీ ప్రభుత్వం అనుసరించిన పక్షపాత వైఖరి, వేధింపుల కారణంగా మన దేశం నుంచి అనేక ప్రయివేటు పెట్టుబడులు తరలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ భారం, ఆకస్మిక లాక్‌డౌన్ తదితర నిర్ణయాలు కొద్దిమంది పారిశ్రామికవేత్తలకు కాసుల పంట పండించాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వ తప్పిదాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి దెబ్బతిన్నదని చెప్పారు. యూపీఏ హయాంలో దేశానికి పెట్టుబడులు భారీగా తరలివచ్చాయని గుర్తు చేశారు. పారిశ్రామిక వేత్తల్లో నెలకొన్న అపనమ్మకాన్ని రానున్న ఇండియా బాక్ ప్రభుత్వం తొలగిస్తుందని భరోసా ఇచ్చారు. చట్టబద్ధమైన పాలనతో అందరి విశ్వాసాన్ని పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడితే దేశ ఆర్థికరంగం ఒడిదుడుకులకు గురవుతుందనీ, స్టాక్ మార్కెట్లు పతనమవుతాయంటూ బీజేపీ నాయకులు పెట్టుబడిదారుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నారని విమర్శించారు. అయితే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేశ ప్రజలు ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. వారు మార్పును కోరుకుంటున్నారని ఆయన వివరించారు. విద్వేష రాజకీయాలతో దేశం విసిగిపోయిందనీ, ఇప్పుడు సొంత సమస్యల పరిష్కారానికి ఓటర్లు సిద్ధమయ్యారని గుర్తు చేశారు. యువత ఉద్యోగాల కోసం, రైతులు కనీస మద్దతు ధర కోసం, రుణమాఫీ కోసం, మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం స్వావలంబన కోసం, కార్మికులు వేతనాల రక్షణ కోసం, ఇండియా బ్లాక్‌కు ఓట్లు వేస్తున్నట్టు తెలిపారు. ప్రజల మధ్య శతృత్వాన్ని, రాష్ట్రాల మధ్య విద్వేషాలను పెంచేలా ప్రధాని మోడీ ప్రసంగాలున్నాయని ఆక్షేపించారు. మోడీ అన్నీ తానై మొత్తం దేశాన్ని నడపాలనుకోవడం ఆయన నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి రప్పించడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం వంటి హామీలను బీజేపీ నెరవేర్చలేదని విమర్శించారు. రిజర్వేషన్లు, రాజ్యాంగం అనే ప్రధాన అంశాలే ఎజెండాగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగాన్ని బీజేపీ మార్చాలనుకుంటున్నదనీ, ప్రజాస్వామ్యాన్ని అణిచివేయాలని చూస్తున్నదని విమర్శించారు. అందుకే ఈ ఎన్నికలు దేశానికి చాలా ముఖ్యమైనవి అని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క వివరించారు.

విభజన హామీలు అమలు చేయని మోడీ

- దొడ్డు వడ్లకూ రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలి :సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఏర్పడిన పదేండ్ల కాలంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. తెలంగాణ, ఏపీకి చేసిందేమీ లేదన్నారు. హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ తాచు పాములాంటిదనీ, దానికి తలతోపాటు తోకలోనూ విషం ఉంటుందని చెప్పారు. ఆ పార్టీది దేశాన్ని ఖండఖండాలుగా విభజించే రాక్షస ఆలోచనా విధానమని అన్నారు. మరో వందేండ్ల వరకు తానే ప్రధానిగా ఉంటానంటూ మోడీ చెప్తున్నారనీ, ఇలాంటి నిరంకుశ, నియంతృత్వ, ఏక వ్యక్తి పాలనను ఎక్కడా చూడలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన 25 ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రకటించారనీ, దీన్నిబట్టి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని అంగీకరించినట్టేనని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు కేంద్రం అనేక వాగ్దానాలు చేసిందనీ, విభజన చట్టంలోని బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, ఐఐఎం, షెడ్యూల్ 9లో సంస్థల విభజన పూర్తి కాలేదని విమర్శించారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ ఆ పార్టీ నాయకులు చెప్తున్నారనీ, మోడీ మాత్రం మార్చబోమంటున్నారని చెప్పారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగించడమంటే రాజ్యాంగ వ్యతిరేకం కాదా? అని ప్రశ్నించారు. ఏదో ఒక పేరుతో హిందూ, ముస్లింల విభజన తీసుకొచ్చి రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని విమర్శించారు. ఇష్టానుసారంగా మాట్లాడుతున్న మోడీపై ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకునే పరిస్థితుల్లో లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమికి అనుకూలంగా ఉంటాయని చెప్పారు. శ్రీరాముని కళ్యాణం జరగకుండానే తలంబ్రాలు పంచడం పాపమని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభానికి కేసీఆర్ పాలన కారణమని విమర్శించారు. మేధావులు, వివిధ రంగాల నిపుణులు, రాజకీయ పార్టీల నాయకుల సలహాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్లాలని సూచించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించాలనీ, పాలమూరు-రంగారెడ్డిని పూర్తి చేయాలని కోరారు. వరి వేస్తే ఉరి అని చెప్పిన కేసీఆర్‌కు వ్యవసాయం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. సన్నబియ్యానికి బోనస్ ఇవ్వ డాన్ని స్వాగతిస్తున్నా మనీ, దొడ్డు వడ్లకూ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్త స్మార్ట్ ఫోన్ పోకో ఎఫ్6 5జీ విడుదల

నవతెలంగాణ - హైదరాబాద్

జెన్ జీ ట్రెండ్సెట్టర్ల కోసం మధ్య-శ్రేణి విభాగంలో ఫ్లాగ్‌షిప్ స్మార్ట్ ఫోన్ అనుభవాన్ని విప్లవాత్మకంగా మార్చడానికి కట్టుబడిన పోకో తాజాగా న్యూఢిల్లీలో జరిగిన హై వోల్టేజ్ ఈవెంట్లో భారతదేశంలో పోకో ఎఫ్6 5జీని విడుదల చేయడం ద్వారా తన ఎఫ్ సిరీస్‌ను అప్గ్రేడ్ చేసింది. పోకో ఎఫ్6 5 భారతదేశంలో అత్యంత ఎదురుచూస్తున్న స్నాప్ డ్రాగన్ 8ఎస్ జెన్ 3 ప్రాసెసర్ని కలిగి ఉండగా, జెన్ జీ గేమర్లు, ఫోటోగ్రఫీ ప్రియులు, టెక్ ప్రేమికులను ప్రత్యేకంగా ఆహ్లాదపరిచేలా తయారు చేశారు. పోకో ఎఫ్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో తనకంటూ ప్రత్యేక స్థానంతో, సరసమైన ధరలో అగ్రశ్రేణి పనితీరును అందిస్తుంది. ఇది అందుబాటులో ఉండే ఆవిష్కరణకు చిహ్నంగా నిలుస్తూ, మధ్య-శ్రేణి ఫోన్ల కోసం నిరంతరంగా అంచనాలను పునర్నిర్వచిస్తుంది. ఈ సంప్రదాయాన్ని సమర్థిస్తూ, పోకో ఇప్పటివరకు ప్రవేశపెట్టిన అత్యంత పనితీరు కేంద్రీకృత స్మార్ట్‌ఫోన్ గా పోకో ఎఫ్6 5జీను తయారు చేసినట్లు పోకో ఇండియా కంట్రీ హెడ్ హిమాన్షు టాండన్ తెలిపారు.

గృహ ఫైనాన్సింగ్‌లో దూసుకుపోతున్న ఐఐఎఫ్ఎల్

నవతెలంగాణ - హైదరాబాద్

ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ ఏయూఎంలో రూ.35,000 కోట్లను అధిగమించి సరసమైన గృహ ఫైనాన్సింగ్లో భారతదేశపు అగ్రశ్రేణి ప్రొవైడర్గా అవతరించింది, ఎఫ్వై23లో రూ.28,512 కోట్లకు, ఎఫ్వై24లో రూ. 35,499 కోట్లకు, ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తన అసెట్ అండర్ మేనేజ్మెంట్ (ఏయూఎం)లో 25% పెరిగింది. ఇది సగటు టిక్కెట్ పరిమాణం రూ. 14.26 లక్షలతో భారతదేశపు అతి పెద్ద సరసమైన హౌసింగ్ ఫైనాన్స్ సంస్థగా మారింది. మే 6, 2024 నాటి ఎక్స్ఛేంజ్ రిపోర్టింగ్ ప్రకారం, అబుదాబి ఇన్వెస్ట్మెంట్స్ అథారిటీ ద్వారా 20% వాటాతో ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్, ఎఫ్వై23లో రూ.2,712 కోట్ల నుండి ఎఫ్వై24లో రూ.3,317 కోట్లకు పెరిగి, 23% వైఓవై వృద్ధిని నమోదు చేసింది. పన్ను తర్వాత లాభం ఎఫ్వై23లో రూ.768 కోట్ల నుండి రూ.24లో రూ.10 కోట్లకు 2% పెరిగింది. నికర వడ్డీ మార్జిన్లు 80 బేసిస్ పాయింట్లు మెరుగుపడ్డాయి. దేశంలోని అన్ని సరసమైన హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలలో కంపెనీ అతి తక్కువ ఖర్చు-ఆదాయ నిష్పత్తులను నిర్వహిస్తోందని సంస్థ సీఈఓ మోను రాత్రా తెలిపారు.